విశాఖపట్నం
శనివారం 4 ఏప్రిల్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 70 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

బైక్‌ను బలంగా ఢీకొన్న

## ట్రావెల్స్ బస్సు



2

ముగ్గురు యువకుల దుర్మరణం

# డబుల్ ధమాకా..!

అటు నియోజకవర్గాల పునర్విభజన

ఉమ్మడి విశాఖలో 23 వరకు అసెంబ్లీ సెగ్మెంట్లు

ఇటు జీవీఎంసీ వార్డుల పెంపు

120 వార్డులకు పెంచాలని కసరత్తు

ఆశావహులకు పదవుల జాతర






(విశాఖపట్నం - జయజయహే)

గ్రేటర్ విశాఖలో ఇప్పుడు పొలిటికల్ డబుల్ ధమాకా నడుస్తోంది. పదవుల కోసం ఇన్నాళ్లూ గాల్లో తేలుతూ కలలు కంటున్న నేతలకు ఇప్పుడు టైమ్ వచ్చేసింది. ఓ వైపు నియోజకవర్గాల పునర్విభజనకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కొందరు నేతలు ఎగిరి గెంతేస్తుండగా, మరోవైపు గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ కూడా వార్డుల పునర్విభనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. దీంతో కుదిరితే ఎమ్మెల్యే టికెట్, లేకుంటే కార్పొరటర్ టికెట్ ఖాయమనుకుంటూ కొందరు లీడర్లు లెక్కలు వేసుకుంటున్నారు. ఇదే విభజన మరికొందరికి దడ పుట్టిస్తోంది. ఇన్నాళ్లు కాచుకు కూర్చున్న సీట్ ఏమైపోతుందోనన్న దడ మొదలైంది. అసలు విశాఖలో తాజా పొలిటికల్ క్యాలిక్యులేషన్స్ చాలా ఆసక్తికరంగా మారింది. జీవీఎంసీకి ఎప్పుడు ఎన్నికలు జరిగినా తిరిగి పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్న తాజా మాజీ కార్పొరేటర్ల ఆశలపై వార్డుల సంఖ్య పెంపు నిర్ణయం నీళ్లు చల్లింది. మరో ఆరు నెలల్లో కచ్చితంగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో వార్డుల్లో పట్టు నిలుపుకునేందుకు తాజా మాజీలంతా కార్యకలాపాలను కొనసాగిస్తూ వచ్చారు. వారితోపాటు ఎన్నికల్లో పోటీకి దిగాలనుకునే ఆశావహులు కూడా విరివిగా కార్యక్రమాలు చేస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొనే ప్రయత్నం చేస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వార్డుల సంఖ్య పెంచుతూ ఉత్తర్వులు జారీచేయడంతో ప్రస్తుతం ఉన్న వార్డుల స్వరూపాలు పూర్తిగా మారిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో వారందరికీ దిక్కుతోచని స్థితి ..మిగతా 2లో



వైసీపీ నాశనం చేయాలనుకుంటే..

## నేను శాసనం చేసా

ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి

9 నగరాల రూపకల్పనతో కేపిటల్ సిటీ

వైసీపీ కుట్రలు ఇక సాగబోవు

దేశమంతా ఆమోదించినా, వైసీపీనే వ్యతిరేకత

ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

(అమరావతి - జయజయహే)

రాజధాని అమరావతికి పార్లమెంట్ సాక్షిగా చట్టబద్ధత లభించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. పుష్కర కాలం కిందట తాము పునాది వేసిన అమరావతి కల ఇప్పుడు చట్టరూపం దాల్చడం శుభపరిణామమని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపిన ఆయన, పార్లమెంట్‌లో అన్ని పార్టీలు ఈ బిల్లును సమర్థించినా, ఒక్క వైసీపీ మాత్రమే వ్యతిరేకించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. దేశంలో అన్ని పార్టీలది ఒక దారైతే, వైసీపీది మరో దారి ..మిగతా 2లో



# స్వశక్తితో.. అరిదమన్

సముద్ర అణు నిరోధకశక్తి మరింత బలోపేతం

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్

(విశాఖపట్నం - జయజయహే)

అరిదమన్ అనేది ఒక పదం కాదని.. ఒక శక్తి అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. శుక్రవారం విశాఖపట్నంలో భారత్ తన మూడో స్వదేశీ అణు బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి ఐఎన్‌ఎస్ అరిదమన్‌ను ఆయన నౌకాదళంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. భారత్ మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ అరిదమన్ అని తెలిపారు. దీంతో సముద్ర ఆధారిత అణు నిరోధకశక్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పని చేస్తున్న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెబోరెటరీ (ఎన్‌ఎస్‌టీఎల్)ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అందులోని కావిటేషన్ టన్నెల్‌కు సైతం ఆయన శంకుస్థాపన చేశారు. 2016లో ఐఎన్‌ఎస్ ..మిగతా 2లో

# చిక్కుల్లో విజయ్?

అఫిడవిట్‌లలో వేర్వేరు సమాచారం

రెండు చోట్ల పోటీకీ నామినేషన్ దాఖలు

క్రిమినల్ కేసులు విషయంలో గందరగోళం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అలజడి మొదలైంది. ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ తన తొలి ఎన్నికల బరిలో వేసిన నామినేషన్లు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీశాయి. ఆయన రెండు నియోజకవర్గాల చెన్నైలోని పెరంబూర్ , తిరుచ్చి ఈస్ట్ నుండి పోటీకి దిగడమే కాకుండా, ఆ రెండు చోట్లా సమర్పించిన అఫిడవిట్లలో పరస్పర విరుద్ధమైన సమాచారం ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా క్రిమినల్ కేసుల విషయంలో ఆయన వెల్లడించిన వివరాలు ..మిగతా 2లో

# స్థిరమైన విధానం లేదు

అమరావతిపై వైసీపీకి స్పష్టత లేదు

జగన్‌ను కాంగ్రెస్ ఎంపీ విమర్శిస్తే..

ఎంపీలు నోరు మెదపలేదు

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు

(హైదరాబాద్ - జయజయహే)

రాజధాని అమరావతిపై వైసీపీకి స్పష్టత కానీ.. స్థిరమైన విధానం కానీ లేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు. గురువారం రాజ్యసభలో రాజధాని అమరావతి బిల్లు ఆమోదం పొందే సమయంలో వైసీపీ ఎంపీలు వ్యవహరించిన తీరుపై విజయసాయిరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆ సమయంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై కాంగ్రెస్ ఎంపీ నోరు పారేసుకుంటే.. వైసీపీ ఎంపీలు మౌనం వహించడం పట్ల ..మిగతా 2లో



తమిళ సైకి ఓకే..

# అన్నామలైకి నో టికెట్

బరిలో నిలుస్తున్న హేమాహేమీలు

మహిళలకు భారీగా సీట్లు కేటాయింపు

ప్రచారానికి మాత్రమే అన్నామలై పరిమితం.. తమిళనాడులో బీజేపీ ప్రయోగాలు





(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు 2026 నేపథ్యంలో బీజేపీ తన 27 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేయడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ముఖ్యంగా పార్టీ గొంతుకగా నిలిచిన అన్నామలై పేరు ఈ జాబితాలో లేకపోవడం, ఆయన స్థానంలో ఇతర హేమాహేమీలకు చోటు కల్పించడంపై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై ఈ ఎన్నికల్లో పోటీ చేయకపోవడం వెనుక సీట్ల కేటాయింపుపై ఉన్న అసంతృప్తి ప్రధాన కారణమని తెలుస్తోంది. ఏఐఏడీఎంకే ..మిగతా 2లో




# ఇక డీజిల్ ధర పెంపు?

ఇప్పటికే ఇండస్ట్రియల్ డీజిల్ పెంపు

సంకేతాలు ఇస్తున్న ఆయిల్ కంపెనీలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరగడం వల్ల, భారతదేశంలోని ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు, అంటే ఐఓసీఎల్ , బీపీసీఎల్ వంటివి, ఏప్రిల్ 1, బుధవారం నాడు పారిశ్రామిక డీజిల్ ధరను ..మిగతా 2లో

# డబుల్ ధమాకా..!

మొదటి పేజీ తరువాయి...

ఎదురైనట్టయింది. జీవీఎంసీ పరిధిలో భీమిలి, అనకాపల్లి మునిసిపాలిటీలు విలీనమైన తర్వాత 2021లో ఎన్నికలు జరిగాయి. అప్పటివరకూ ఉన్న 72 వార్డులను 98 వార్డులకు పెంచారు. ఎన్నికలు నిర్వహించడంతో 98 మంది కార్పొరేటర్లు కౌన్సిల్‌లో అడుగుపెట్టారు. వారందరి ఐదేళ్ల పదవీకాలం ఈ మార్చి 17తో ముగిసింది. వెంటనే ఎన్నికలు జరుపుతామని సీఎం ప్రకటించడంతో తాజా మాజీ కార్పొరేటర్లంతా అవకాశం ఉన్నంతవరకు ప్రతిరోజూ వార్డులో అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. వారితోపాటు గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైనవారు, త్వరలో జరిగే ఎన్నికల్లో పోటీకి దిగాలనే ఆలోచనలో ఉన్నవారు కూడా కార్యక్రమాలు నిర్వహిస్తూవస్తున్నారు. ఇలాంటి తరుణంలో 15 లక్షలకు పైబడిన జనాభా కలిగిన జీవీఎంసీలో వార్డుల సంఖ్యను 120కి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ప్రస్తుతం ఉన్న 98 వార్డుల ముఖచిత్రాలు పూర్తిగా మారిపోతాయి. ఏ వార్డులోకి ఏఏ ప్రాంతాలు వెళతాయో ఇప్పట్లో స్పష్టత వచ్చే అవకాశం లేదు. వార్డుల పునర్విభజన తర్వాత రిజర్వేషన్ ఖరారు కావాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటి నుంచే వార్డుల్లో డబ్బు ఖర్చుపెట్టినా, ప్రజలకు సేవ చేసినా ప్రయోజనం ఉండకపోవచ్చునని, పునర్విభజన, రిజర్వేషన్ ఖరారైన తరువాత తమకు అనుకూలంగా ఉండే వార్డును ఎంపిక చేసుకుని...అప్పుడు కార్యక్రమాలు ప్రారంభించవచ్చుననే ఆలోచనలో తాజా మాజీ కార్పొరేటర్లు, ఆశావహులు ఉన్నారు.

ఇక అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన కూడా ఉమ్మడి విశాఖ జిల్లా రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేయనుంది. ఇప్పటి వరకు 15 అసెంబ్లీ నియోజకవర్గాలు, మూడు పార్లమెంట్ స్థానాలు విశాఖ జిల్లాలో ఉన్నాయి. ఇప్పుడు పునర్విభజన జరిగితే అసెంబ్లీ నియోజకవర్గాలు దాదాపుగా 23 వరకు చేరే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం విభజన చేయనుండటంతో నియోజకవర్గానికి 1.6 లక్షల మంది ఓటర్ల పరిమితి ఉండేలా చూడాలన్నది ప్రభుత్వం లెక్క. ఈ లెక్కన చూస్తే విశాఖ సిటీలోనూ, అనకాపల్లి జిల్లాలోనూ చాలా నియోజకవర్గాల్లో మూడు లక్షలకు మించి ఓటర్లు ఉన్నారు. విశాఖ సిటీ లిమిట్స్ లో చూసుకుంటే భీమిలి, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో మూడు లక్షలకు మించి ఓటర్ల ఉండటంతో స్థానాలు చీలిపోయే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. విశాఖ అర్బన్ లో ఈస్ట్, సౌత్, వెస్ట్ , నార్త్ నియోజకవర్గాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఈ నాలుగు నియోజకవర్గాల్లో ఓటర్లను చీల్చి కొత్తగా విశాఖ సెంట్రల్ పేరిట కొత్త అసెంబ్లీ స్థానం ఆవిర్భవించే చాన్స్ ఉందంటున్నారు. ఇక అనకాపల్లి జిల్లాలో చూస్తే హోం మంత్రి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలో అత్యధిక మంది ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గాన్ని విభజించి పొరుగున ఉన్న అచ్యుతాపురం, నర్సీపట్నం నియోజకవర్గాల కొంత భాగాలను కలిపి కొత్త అసెంబ్లీ స్థానం ఏర్పడే అవకాశం ఉందట. అలాగే అనకాపల్లి , యలమంచిలి పరిధిలో కూడా కొత్తగా అనకాపల్లి రూరల్ పేరిట మరో అసెంబ్లీ స్థానం ఆవిర్భవించే చాన్స్ ఉందట. అలాగే పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో కొంత విభజన చేసి గతంలో ఉండే పరవాడ నియోజకవర్గాన్ని మళ్లీ తెరమీదకు తీసుకువచ్చే అవకాశాలు లేకపోలేదని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. అలాగే అరకు, పాడేరు అసెంబ్లీ స్థానాలను పునర్విభజన చేస్తే కొత్తగా అక్కడ కూడా మరో నియోజకవర్గం అందుబాటులోకి వస్తుదంటున్నారు.

మరోవైపు మహిళా రిజర్వేషన్లు కూడా ఇదే సందర్భంలో అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రస్తుతం ఉన్న 15 స్థానాలు సుమారుగా 23కి చేరితో అందులో కనీసంగా మహిళా రిజర్వేషన్ల ప్రకారం ఆరు లేదా ఏడు స్థానాలు మహిళలకు దక్కే ఛాన్స్ ఉంది. ఇప్పటికే పలు పార్టీల్లో సుదీర్ఘకాలం పాటు రాజకీయంగా కొనసాగుతున్నా సరే అవకాశాలు లేని మహిళలకు విశాఖ జిల్లా గేమ్ ఛేంజర్ కాబోతోందనే టాక్ నడుస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో పాయకరావుపేట నుంచి గెలిచిన హోం మంత్రిగా ఉన్న అనిత మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అటు పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు వస్తే ఉమ్మడి విశాఖలో ఆరు నుంచి ఏడుగురు మహిళలు ఎమ్మెల్యేలుగా వచ్చే అవకాశాలు ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో చాలా నియోజకవర్గాల్లో దశాబ్దాల తరబడి ఒకే నేత ఎమ్మెల్యేగా కొనసాగుతుండటం, మరికొన్ని చోట్ల వలస నేతలు పాగా వేయడంతో కొత్త వారికి అవకాశాలు దక్కడం లేదు. అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణ మూర్తి, గంటా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, వెలగపూడి రామకృష్ణ, పల్లా శ్రీనివాస్, గణబాబు.. ఇలా కొందరు నేతలు సుదీర్ఘకాలంగా నియోజకవర్గాలను వదలక కొత్త వారికి ఛాన్స్ లేకుండా పోతోంది. రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యే కావాలని సర్పంచ్ మొదలుకొని ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీల వరకు అందరికీ ఉంటుంది. అలాగే పార్టీల్లో చురుగ్గా పని చేసే వారికి కూడా ఆశ ఉంటుంది. కానీ అవకాశాలే లేవు. అలాంటి వారికే ఇప్పుడు సువర్ణావకాసం దక్కబోతోంది. నియోజకవర్గాల స్వరూపం మారితే తమ సీటుకు ఎక్కడ ఎసురు వస్తుందోనని సిట్టింగ్ లీడర్లకు దడ పుట్టిస్తోంది. గ్రేటర్ విశాఖలో 98 ఉన్న వార్డులు 120 కాబోతున్నాయి. అంటే కొత్త గా వచ్చే వార్డుల్లో ప్రతీ పార్టీ నుంచి ఒకరికి పోటీ చేసే అవకాశం దక్కబోతోంది. అలాగే అసెంబ్లీ స్థానాలు కూడా 15 ఉంటే అవి సుమారుగా 22 లేదా 23కి చేరబోతున్నాయట. అంటే అసెంబ్లీకి కూడా ఏడెనిమిది స్థానాలు పెరిగితే, ఇక్కడ కూడా ప్రతీ పార్టీ నుంచి కొత్తగా ఏడెనిమిది మందికి ఎన్నికల్లో పోటీ చేసే ఛాన్స రాబోతోంది. ఇన్నాళ్లకు వచ్చిన ఈ లక్కీ ఛాన్స్ ను కొట్టేసి ప్రజాప్రతినిధిగా నిలవాలని ఆశావహుల్లో ఉత్సాహం కనిపిస్తోంది.

పునర్విభనతో విశాఖ రాజకీయ ముఖ చిత్రం మారుతున్నట్లే, కొందరి నేతలకు కొత్త అవకాశాలు రావడంతో వారి తలరాత కూడా మారబోతోంది. గోల్డెన్ పొలిటికల్ చాన్స్ నాకే దక్కాలంటూ కొందరు నేతలు ఎవరికివారు ఇప్పటి నుంచే పైరవీలు చేసుకోవడం, రాజకీయ శిక్షణ తీసుకుంటున్నారు.. ఇటు జీవీఎంసీలోనూ, అటు అసెంబ్లీ సెగ్మెంట్లలో కసిలి పొలిటికల్ డబుల్ ధామాకే దక్కేవదెరికో చూడాల్సిందే..



## బైక్‌ను బలంగా ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

### ముగ్గురు యువకుల దుర్మరణం

అనకాపల్లి, జయజయహే

అనకాపల్లి జిల్లాలో అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఎలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్ద రాత్రి 12 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనాన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు అనకాపల్లికి తరలిస్తుండగా చనిపోయారు. మృతి చెందిన ముగ్గురు యువకులు



ఎలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. మృతులు బంగారు నాని(24), గోవిందు (25) , పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బంగారి దుర్గాప్రసాద్(16)గా గుర్తించారు. మృతుల్లో ఇద్దరు పెయింటింగ్ పనులు చేసుకోగా, మరో యువకుడు చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుల మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## స్థిరమైన విధానం లేదు

మొదటి పేజీ తరువాయి...

అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌పై కాంగ్రెస్ ఎంపీ ఆ విధంగా మాట్లాడితే.. మీకు చీమకుట్టినట్లు అయినా అనిపించ లేదా అంటూ వైసీపీ ఎంపీలను ఆయన సూటిగా ప్రశ్నించారు. రాజ్యసభలో వైసీపీ ఎంపీలు మౌన ప్రేక్షకులయ్యారా? అని విజయసాయిరెడ్డి సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంపీ వ్యాఖ్యలను కనీసం ఖండించరా? అని వైసీపీ ఎంపీలకు విజయసాయిరెడ్డి చురకలంటించారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై బుధవారం లోక్‌సభలో.. గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ హయాంలో అమరావతి విషయంలో వైఎస్ జగన్ వ్యవహరించిన తీరుపై పలువురు ఎంపీలు విమర్శించారు. ఈ వ్యాఖ్యలను రాజ్యసభలోని వైసీపీ సభ్యులు ఎందుకు ఖండించ లేదంటూ విజయసాయిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. పై విధంగా స్పందించారు.

## ఇక డీజిల్ ధర పెంపు?

మొదటి పేజీ తరువాయి...

పెంచాయి. మీడియా కథనాల ప్రకారం, పారిశ్రామిక డీజిల్ ధర లీటరుకు రూ. 28.22 పెరిగింది. దీంతో లీటరు ధర రూ. 109.59 నుండి రూ. 137.81కి చేరింది. ఇది 25 శాతం ధర పెరుగుదలను సూచిస్తుంది. గతంలో, మార్చి 20న, పారిశ్రామిక డీజిల్ ధరలను రూ. 22 పెంచడంతో, జాతీయ రాజధానిలో దాని ధర రూ. 87.67 నుండి రూ. 109.59కి చేరింది. చమురు కంపెనీలు కూడా ఫర్నేస్ ఆయిల్ ధరను లీటరుకు రూ. 23.77 పెంచాయి. పారిశ్రామిక డీజిల్, హెచ్‌ఎస్‌డిని వాణిజ్య సంస్థలకు బల్క్‌గా అమ్ముతారు. జనరేటర్లను నడపడానికి డీజిల్‌ను ఉపయోగించే పెద్ద కర్మాగారాలు, తయారీ యూనిట్లు దీనిని కొనుగోలు చేస్తారు. పెద్ద నిర్మాణ సంస్థలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు కూడా దీనిని ఉపయోగిస్తాయి. ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు, పెద్ద రవాణాదారులు కూడా కంపెనీల నుండి డీజిల్‌ను బల్క్‌గా కొనుగోలు చేస్తారు. ఇది డీజిల్ కంటే కొంచెం చిక్కగా ఉండే ఒక రకమైన ఇంధన అయిల్. దీనిని భారీ యంత్రాలను నడపడానికి ఉపయోగిస్తారు. ఇది డీజిల్ కంటే చౌకగా ఉండటం వల్ల, పరిశ్రమలలో దీనిని విస్తృతంగా ఉపయోగిస్తారు. దీని ధర లీటరుకు రూ. 23.77 పెరగడం వల్ల ఉక్కు, సిమెంట్ పరిశ్రమలకు కూడా ఖర్చులు పెరుగుతాయని అంచనా. దీనిని కర్మాగారాల్లో కొలిమిలకు ఇంధనంగా, విద్యుత్ కేంద్రాలలో విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి, ఫ్యాక్టరీ బాయిలర్లలో ఆవిరిని ఉత్పత్తి చేయడానికి, పెద్ద ఓడల ఇంజిన్లలో ఉపయోగిస్తారు. మరోవైపు, సాధారణ పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు పంపు ధరలు స్థిరంగా ఉన్నాయి. అంటే, రిటైల్ పెట్రోల్ పంపుల వద్ద పెట్రోల్, డీజిల్ ధరలు మారలేదు. అయితే, నయారా ఎనర్జీ, షెల్ వంటి ప్రైవేట్ రిటైలర్లు కంపెనీ నష్టాలను పూడ్చుకోవడానికి ధరలను రూ. 3 నుంచి రూ. 25 వరకు పెంచారు.

## తమిళ సైకి ఓకే.. అన్నామలైకి నో టికెట్

మొదటి పేజీ తరువాయి...

నేతృత్వంలోని కూటమిలో బీజేపీకి కేటాయించిన 27 సీట్ల విషయంలో అన్నామలై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తనకు పట్టున్న కోయంబత్తూర్ రీజియన్‌లోని సింగనల్లూర్', గౌండంపాలయం స్థానాలను ఏఐఏడీఎంకే ఇవ్వకపోవడంపై ఆయన గుర్రుగా ఉన్నట్లు సమాచారం. దీనిపై పార్టీ జాతీయ నాయకత్వానికి తన తీవ్ర అసంతృప్తి ని వ్యక్తం చేస్తూ, తాను పోటీకి దూరంగా ఉండి కేవలం ఒక కార్యకర్తగా ప్రచారం చేస్తానని ప్రకటించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు వినోజ్ పి. సెల్వం కేవలం గెలుపు గుర్రాలనే బీజేపీ బరిలోకి దించినట్లు ప్రకటించారు. కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ అవనాశి (ఎస్సీ), మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెన్నైలోని మైలాపూర్ నుండి పోటీ చేస్తున్నారు. వీరితో పాటు వానతి శ్రీనివాసన్ కోయంబత్తూర్ నార్త్ , నైనార్ నాగేంద్రన్ సాత్తూర్ వంటి చోట్ల పోటీ చేస్తున్నారు. అనుభవం, నియోజకవర్గాలపై పట్టున్న వారికే ప్రాధాన్యత ఇచ్చామని, ఈ 27 మంది భారీ మెజారిటీతో గెలుస్తారని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది. జాబితా ప్రకటన తర్వాత బీజేపీలో కొన్ని చోట్ల అసమ్మతి సెగలు రేగాయి. సీట్ల పంపకంలో ఏఐఏడీఎంకే పెత్తనం సాగించిందని, బీజేపీ ఎదుగుతున్న నియోజకవర్గాలను కాకుండా బలహీనంగా ఉన్న స్థానాలను కేటాయించారని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిరుప్పరంకుండ్రం వంటి కీలక స్థానాల్లో బీజేపీకి చోటు దక్కకపోవడంపై స్థానిక నేతలు మండిపడుతున్నారు. అన్నామలై లాంటి ఫైర్ బ్రాండ్ నేత బరిలో లేకపోవడం వల్ల క్యాడర్‌లో ఉత్సాహం తగ్గే ప్రమాదం ఉందని బీజేపీ క్యాడర్ భావిస్తున్నారు. ఈసారి బీజేపీ మహిళా అభ్యర్థులకు గణనీయమైన ప్రాధాన్యత ఇచ్చింది. తమిళిసైతో పాటు కీర్తిక శివకుమా , కవితా శ్రీకాంత్, విజయధారణి వంటి హిళా నేతలను గెలుపు అవకాశాలున్న చోట బరిలోకి దించింది. ఇది మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ వేసిన మాస్టర్ ప్లాన్ అని చెప్పవచ్చు. అన్నామలై అభ్యంతరాలు వ్యక్తం చేసినా, పార్టీ హైకమాండ్ మాత్రం ఏఐఏడీఎంకేతో పొత్తు దెబ్బతినకుండా జాగ్రత్త పడింది. ప్రస్తుతానికి కూటమి ముఖ్యం, 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి తమిళనాడులో బలమైన శక్తిగా ఎదగాలంటే ప్రాంతీయ పార్టీతో కలిసి నడవక తప్పదు అనేది ఢిల్లీ పెద్దల ఆలోచనగా కనిపిస్తోంది. అందుకే అన్నామలైని రాష్ట్రవ్యాప్త ప్రచారానికి పరిమితం చేసి, ఆయన ఛరిష్మాను అన్ని నియోజకవర్గాల్లో వాడుకోవాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది.




### వైసీపీ నాశనం చేయాలనుకుంటే..

## నేను శాసనం చేసా

మొదటి పేజీ తరువాయి...

అంటూ ఆ పార్టీ వైఖరిని ఎండగట్టారు. తాను తెలంగాణ అభివృద్ధికి ఎప్పుడూ వ్యతిరేకం కాదని, నిజానికి సైబరాబాద్, హైటెక్ సిటీల రూపకల్పనతో తెలంగాణ తన బ్రెయిన్ చైల్డ్ అని చంద్రబాబు గుర్తుచేశారు. విభజన సమయంలో రెండు రాష్ట్రాలకు న్యాయం జరగాలని కోరుకున్నానని, కానీ రాజధాని కూడా లేకుండా ఏపీని విడదీయడం అన్యాయమని పేర్కొన్నారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన అనుభవంతో పోలవరం ముంపు మండలాలను ఏపీలో విలీనం చేయించానని, అవి కలిపితేనే తాను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తానని పట్టుబట్టి సాధించుకున్నానని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జగన్ ప్రతిపాదించిన మావిగన్ వంటి వింత పేర్లపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పేరు చెప్పడానికి కూడా నాకు ఇష్టం లేదు అంటూ కౌంటర్ ఇచ్చారు. 2014లోనే 9 నగరాల కలయికతో ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని ప్లాన్ చేశామని, కానీ గత పాలకులు కుట్రలతో, నేరాలతో దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రైతులను రెచ్చగొట్టినా వారు వెనక్కి తగ్గకుండా భూములు ఇచ్చారని, అమరావతి రైతుల త్యాగం వృథా పోదని భరోసా ఇచ్చారు. ఒకప్పుడు హైదరాబాద్ కంటే అమరావతిలోనే భూముల ధరలు ఎక్కువగా ఉండేవని చంద్రబాబు గుర్తుచేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ చుట్టూ భూములు ఇచ్చిన వారు ఎలాగైతే లాభపడ్డారో, భవిష్యత్తులో అమరావతి రైతులు కూడా అదే స్థాయిలో ఆర్థికంగా ఎదుగుతారని ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో అపారమైన వ్యవసాయ భూములు ఉన్నాయని, సరైన ప్రణాళికతో అభివృద్ధి చేస్తే హైదరాబాద్‌ను మించిన సంపదను సృష్టించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. గత పాలకుల తీరును ఉద్దేశించి మాట్లాడుతూ.. గతంలో వారిని సైకోలు అనేవారు, ఇప్పుడు అవన్నీ మాట్లాడదలుచుకోలేదు అంటూ పరోక్షంగా జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు సంధించారు. వైసీపీ నేతలు గతంలో మంత్రులుగా ఎలా పనిచేశారో అర్థం కావడం లేదని, వారి కుట్రలు ఇక సాగవని హెచ్చరించారు. భగవంతుడు తనకు రెండు గొప్ప అవకాశాలు ఇచ్చాడని, ఒకప్పుడు హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపినట్లే, ఇప్పుడు అమరావతిని అత్యుత్తమ రాజధానిగా నిర్మిస్తానని చంద్రబాబు శపథం చేశారు.

## చిక్కుల్లో విజయ్?

మొదటి పేజీ తరువాయి...

ఇప్పుడు ప్రత్యర్థి పార్టీలకు అస్త్రంగా మారాయి. విజయ్ తన రాజకీయ అరంగేట్రంలో భాగంగా చెన్నైలోని పెరంబూరు , తిరుచ్చిలోని తిరుచ్చి ఈస్ట్ రెండు నియోజకవర్గాల నుండి నామినేషన్లు వేశారు. అయితే, పెరంబూరు నియోజకవర్గంలో దాఖలు చేసిన అఫిడవిట్‌లో తనపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని పేర్కొన్న విజయ్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గం కోసం సమర్పించిన అఫిడవిట్‌లో మాత్రం తనపై ఒక కేసు పెండింగ్‌లో ఉన్నట్లు స్వయంగా వెల్లడించారు. 2025లో నమోదైన ఒక కేసు వివరాలను తిరుచ్చి అఫిడవిట్‌లో పొందుపరిచి, పెరంబూరులో మాత్రం దాన్ని దాచిపెట్టడం లేదా మర్చిపోవడం ఇప్పుడు రాజకీయంగా వివాదాస్పదమైంది. ఒకే అభ్యర్థి రెండు వేర్వేరు నియోజకవర్గాల్లో వేర్వేరు సమాచారంతో కూడిన అఫిడవిట్లు ఇవ్వడం ఎన్నికల నియమావళి ప్రకారం తప్పిదమని, ఇది ఆయన నామినేషన్ చెల్లుబాటుపై ప్రభావం చూపే అవకాశం ఉందని న్యాయ నిపుణులు, ప్రత్యర్థి పార్టీలు విశ్లేషిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇవ్వడం తీవ్రమైన నేరం కావడంతో, ఈ అంశం ఇప్పుడు విజయ్ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందా అన్న ఉత్కంఠ నెలకొంది. నామినేషన్లు చెల్లకపోయే అవకాశం ఉందని భావిస్తున్నారు. విజయ్ ఆస్తుల విలువ లిరూ. 625 కోట్లు గా వెల్లడవ్వడం, అందులో తన భార్య సంగీతకు ఆయన ఇచ్చిన రూ. 12.6 కోట్ల అప్పు వివరాలు కూడా ఉండటం చర్చనీయాంశం అయింది. విజయ్ 1992లో చెన్నైలోని లయోలా కాలేజీలో బీఎస్సీ డిస్కంటిన్యూ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన గ్యారేజీలో బీఎండబ్ల్యూ ఐ7, టయోటా లెక్సస్ వంటి అత్యాధునిక లగ్జరీ కార్లతో పాటు, ఒక టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్ కూడా ఉండటం అభిమానులను ఆశ్చర్యపరిచింది. మొత్తం మీద, తొలిసారి ఎన్నికల బరిలో దిగుతున్న విజయ్ ఆస్తుల వివరాలు . వ్యక్తిగత జీవితానికి సంబంధించిన క్లారిటీ ఇప్పుడు తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.



## స్వశక్తితో.. అరిదమన్

మొదటి పేజీ తరువాయి...

అరిహంత్, 2024 ఆగస్టులో ఐఎన్‌ఎస్ అరిఘాట్‌ల సరసన తాజాగా ఐఎన్‌ఎస్ అరిదమన్ చేరింది. అరిదమన్ చేరికతో.. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మించి, నిర్వహిస్తున్న అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి ఎంపిక చేసిన దేశాల క్లబ్‌లో భారత్ చేరింది. ఈ జలాంతర్గాములు శుత్రువుల కంటపడకుండా నెలల తరబడి సముద్రగర్భంలో ఉంటాయి. శత్రు దేశాల నుంచి అణు దాడి జరిగితే.. సముద్రం లోపలి నుంచే దీటుగా ఇవి బదులిస్తాయి.

# మంత్రి కందుల దుర్గేష్ విస్తృత పర్యటన

## అభివృద్ధి పనుల త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం

## మంత్రి నాదెండ్ల ఘన స్వాగతం పలికిన మంత్రి దుర్గేష్

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం నిడదవోలు నియోజకవర్గంలోని పెరవలి మండలం ఉసులుమర్రు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఆరోగ్య కేంద్రం పనుల పరిశీలన: నేషనల్ హెల్త్ మిషన్ నిధులు రూ. 36 లక్షలతో నిర్మిస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులను మంత్రి దుర్గేష్ పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువ కావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను,



అధికారులను ఆదేశించారు.గోదావరి తీరంలో సౌకర్యాల కల్పన: ఉసులుమర్రు వద్ద గోదావరి నది రేవు మెట్లపై భక్తులు, స్థానికుల సౌకర్యార్థం నిర్మిస్తున్న షెడ్ పనులను మంత్రి దుర్గేష్ పరిశీలించారు. ఎండ, వానల నుండి రక్షణ పొందేలా ఈ షెడ్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.రహదారి వెడల్పుపై హామీ: ఉసులుమర్రు గ్రామంలోని ప్రధాన రహదారికి సంబంధించి 18 ఫీట్ల వెడల్పుకు బదులుగా ప్రస్తుతం 12 ఫీట్ల రహదారి మాత్రమే మంజూరైన విషయాన్ని స్థానికులు మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి దుర్గేష్ భవిష్యత్ లో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి వెడల్పుతో కూడిన 18 ఫీట్ల ప్రధాన రహదారి మంజూరుకు ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మంత్రి నాదెండ్ల మనోహర్‌కు స్వాగతం నిడదవోలు విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కు మంత్రి కందుల దుర్గేష్ ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ కూటమి నాయకులతో కలిసి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని పలు ప్రాంతీయ అంశాలపై చర్చించారు. ఈ పర్యటనలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు



## పాఠశాల యాజమాన్యపు

# నిర్లక్ష్యానికి పూజిత బలి

## జరిగిన సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలి

## ఆంధ్ర ప్రదేశ్ సమతా సైనిక్ దళ్ డిమాండ్

**టెక్కలి ఏప్రిల్ 3 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ప్రభుత్వ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న చింతల పూజిత మెట్ల పైనుంచి జారిపడి మృతి చెందడం చాలా విచారకరమని ఆంధ్రప్రదేశ్ సమతా సైనిక దళ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు చల్లా రామారావు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు . ప్రభుత్వ గురుకుల పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని జరిగిన సంఘటనపై పారదర్శకత గల దర్యాప్తు జరిపించి సంఘటనకు బాధ్యులైన వారికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కోట బొమ్మాలి లోని పూజిత కుటుంబ సభ్యుల్ని కలిసి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి తల్లిదండ్రులను ఓదార్చరు, దీనిపై ప్రభుత్వం సమగ్రమైన క్షేత్రస్థాయి దర్యాప్తు చేసి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని రామారావు విజ్ఞప్తి చేశారు.



# సామాజిక భవనాలు నిర్మించండి

## ఎమ్మెల్యే గంటాకు నూకరాజు విజ్ఞప్తి

**భీమిలి (జయ జయహే)**

భీమిలి జోన్ 3వ డివిజన్లో పెండింగ్ లో ఉన్న సామాజిక భవనాలు, కళ్యాణమండపాలు నిర్మించాలని కోరుతూ భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావును వినతిపత్రం ద్వారా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో గంటా నూకరాజు మర్యాదపూర్వకంగా కలసి భీమిలి జోన్ 3వ డివిజన్లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా మంగళవీధి, ఎన్టీఆర్ కోలనీ, నేరళ్లవలస కోలనీ, అప్పికొండవీధిలో నూతనంగా సామాజిక భవనాలు నిర్మించాలని కోరారు. బోయవీధి, తోటవీధి, కృష్ణాకోలనీ, రెల్లివీధి, గొల్లలపాలెంలో ప్రస్తుతం ఉన్న సామాజిక భవనాలపై మరొక అంతస్తు నిర్మించినట్లయితే స్థానుకులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. శిదిలావస్థలో ఉన్న మహాత్మాగాంధీ కళ్యాణమండపాన్ని పూర్తిగా పడగొట్టి నూతనంగా నిర్మించాలని కోరారు. గొల్లలపాలెంలో కొండపై నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణమండపం యొక్క పనులు మధ్యలో ఆగిపోయాయని త్వరతగతిన నిర్మించడానికి అధికారులకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. అదేవిదంగా ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు కావలసిన పరికరాలను సమకూర్చవలసినదిగా కోరారు. 2014-19 మధ్యకాలంలో తమరు భీమిలి శాసనసభ్యులుగా, విద్యాశాఖ మంత్రిగా ఉండేటప్పుడు నిర్మించిన సామాజికభవనాలు ఉన్నాయని వాటిపై మరొక అంతస్తు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి నిధుల విడుదలకు మార్గం సుగమం చేయవలసినదిగా గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు.

## విజయనగరంలో ఘనంగా ముగిసిన

# తితిదే ధార్మిక కార్యక్రమాలు

**ఆళ్లగడ్డ (జయ జయహే)**



గత నాలుగు రోజులుగా ఆళ్ళగడ్డ మండలం, విజయనగరం గ్రామంలోని శ్రీ రామాలయం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలతో ఘనంగా ముగిశాయి. మూడురోజుల పాటు స్థానిక భజన మండలిచే భజనలు, ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్ చే ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ధార్మిక వ్యాప్తి కోసం ఆలయం ఉన్న ఏ గ్రామంలోనైనా ముందుగా కోరుకున్న ప్రదేశాలలో తిరుమల తిరుపతి దేవస్థానముల సంపూర్ణ సహకారంతో ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నామని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భవనం వేణుగోపాల్ రెడ్డి, టి.శ్రీనివాస రెడ్డి, బి.సుబ్బారెడ్డి, ఎ. సుబ్బారెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, బి. శ్రీనివాసులు రెడ్డి, హార్మోనిష్టు నాగేంద్రమ్మ, భజన మండలి సభ్యులు రాజేశ్వరి, కృష్ణవేణి, కల్పన, శిరీష, ఈశ్వరమ్మ, వెంకటరత్నమ్మ, బి. కోటేశ్వరమ్మ, అనంతలక్ష్మి, శ్రావణి, మస్తానమ్మ, పుల్లమ్మ, ప్రసన్న, వెంకాయమ్మ, నవభారతి, బి. సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

# రామాలయంలో మంచినీటి కొళాయి ప్రారంభించిన డాక్టర్ కందుల

**విశాఖపట్నం (జయ జయహే)**



ఆధ్యాత్మిక చింతనతోనే భక్తి భావం వెల్లువిరుస్తుందని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32 వ వార్డు మాజీ కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు తెలిపారు. 31 వ వార్డు కృష్ణ గార్డెన్ రామాలయంలో మంచినీటి కొళాయిని ప్రారంభించారు. రామాలయంలో మొత్తం మూడు గుడుల సందర్శన కోసం పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ఇక్కడ మంచినీటి కొళాయిని ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ ఆలయాలకు భక్తులు వచ్చి దర్శనం చేసుకుని వెళుతూ ఉంటారని పేర్కొన్నారు. భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు ఇక్కడ కొళాయి ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరిలో నేడు భక్తి భావం పెరుగుతుందని చెప్పారు. మానసిక ప్రశాంతతకు, ఆధ్యాత్మిక భావనలకు నెలవైన హిందూ దేవాలయాల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు అప్పారావు, అధ్యక్షులు సునీల్, కార్యదర్శి కర్రి గణేష్, కోశాధికారి ఓ.దామోదర్, ఇందిరా, ప్రియాంక, లక్ష్మి, కే.కృష్ణ, సిపిఐ బుజ్జి, బిజెపి నాయకులు వీరభద్రరావు, హేమ, శ్రీదేవి, కే.రమణమ్మ పాల్గొన్నారు.

# మాడుగుల మండలం ఉద్యోగ ఐక్య కార్యాచరణ సమితి ఏర్పాటు

**మాడుగుల ఏప్రిల్ 3 జయ జయహే**

మాడుగుల మండల ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి నూతనంగా ఏర్పాటయింది. ఈ సందర్భంగా పాలకవర్గ ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్ గా ఎస్ ఏ రాజు(నాని)( మాడుగుల ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు) వైస్ చైర్మన్ డి శ్రీనివాసరావు, (పి.ఆర్.టి.యు) మరో వైస్ చైర్మన్ గా కె వి ఎస్. నారాయణ,( ఎన్. ఎం.యు..ఆర్. టి.సి ) వైస్ ఛైర్మెన్ పి.చంద్రరావు(,యు.టి.ఎఫ్ ) సెక్రటరీగా ఎ.ప్రసాదరావు (ఎ.పి.టి.ఎఫ్) జాయింట్ సెక్రటరీ గా ఓమ్మి రమణమ్మ (ఏ.పి.ఎన్. జి.జి.ఓ) జాయింట్ సెక్రటరీగా ఆర్. రామకొండలరావు (పెన్షనర్స్ అసోసియేషన్ ) మరో జాయింట్ సెక్రటరీగా టి చంద్రశేఖర్ (క్లాస్ 4 ఎంప్లాయీస్ ) కోశాధికారిగా పి.అనూష (ఎ పి ఎన్ జి జి ఓ) బీసీ మెంబర్లుగా ఎస్ ఎన్ వి డి సూర్యనారాయణ. (ఏపీటీఎఫ్) సిహెచ్



ఆనందరావు,( యుటిఎఫ్)పి సత్యవేణి (ఏపీటీఎఫ్) ఏం కోటేశ్వరరావు (యుటిఎఫ్) జి డి ఇ దేవి(జి ఎస్ డబ్ల్యూ ఎస్ ) డి రామకృష్ణవేణి (జి ఎస్ డబ్ల్యూ ఎస్), బి స్వాతి ( మహిళా పోలీసు) జే.వెంకట భార్గవి (జి ఎస్ డబ్ల్యూ ఎస్) ఎన్నికైనట్టు యూనియన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.



# ఎంఎస్ఎంఈలతో యువతకు ఉపాధి

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**పెనుకొండ/శ్రీసత్యసాయి (జయ జయహే)**

రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఆసక్తి కలిగిన యువత ముందుకొస్తే సబ్సిడీ రుణాలు అందజేసి, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుకు వెన్నుదన్నుగా ఉంటామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని కొండంపల్లి గ్రామంలో ఫెర్టిలైజర్స్, పౌల్ట్రీ ఫీడ్ విక్రయ శాలలను మంత్రి సవిత శుక్రవారం ప్రారంభించారు. అనంతరం తనను కలిసి విలేకరులతో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన యువతతో చిన్న, మధ్యతరహా పరిశ్రమ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేసి, వారికి వెన్నుదన్నుగా నిలువనుందని మంత్రి సవిత వెల్లడించారు.

# నడక మైదానంనకు పివిజి రాజు పేరు పెట్టాలని ఎమ్మెల్యేకు వినతి

**విజయనగరం (జయ జయహే )**

విజయనగరం 42వ డివిజన్ పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్ నడక మైదానంనకు వాకర్స్ ఉద్యమకారులైన తోషిని వాల్, ఆల్వార్ దాస్ లేదా విజయనగరంనకు గొప్ప దాత,విద్యాదాత పీ.వీ.జీ. రాజు పేరు పెట్టాలని, అలానే పిల్లలకు క్రీడా పరికరాలు, యువతీ యువకులకు బహిరంగ వ్యాయామశాలా పరికరాలు కేటాయించాలని శుక్రవారం విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు అశోక్ బంగ్లాలో నిర్వహించే గ్రీవెన్స్ లో విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజుకు సామజికవేత్త, అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు (బాలు), క్లబ్ కార్యదర్శి కోట్ల ఈశ్వరరావు, సహ కార్యదర్శి ఇందుకూరి అప్పలరాజు, క్లబ్ పెద్దలు కోట్ల సత్యనారాయణ, దేవి ప్రసాద్ మాస్టారు



వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా త్యాడ రామకృష్ణారావు(బాలు) మాట్లాడుతూ 42వ డివిజన్ పరిధిలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ నడకమైదానంలో చాలా మంది స్థానిక ప్రజానీకం నడుస్తూ, వ్యాయామం చేస్తున్నారని, తరుచుగా అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సభ్యులు అనేక వివిధ సామజిక సేవా కార్యక్రమాలతో పాటు, వైద్యశిబిరాలు, శ్రమదాన కార్యక్రమాలు చేబడుతున్నామని, దీనిపై పిల్లలకు క్రీడా పరికరాలు, నడక సభ్యులకు, స్థానిక యువతీయువకులకు వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేస్తే మరింత బాగుంటుందని, అలానే మైదానంనకు పేరు ఉంటే ఇంకా చేసే కార్యక్రమాలకు గుర్తింపు వస్తుందని నడక సభ్యులంతా మరింత ఉత్సాహంతో పనిచేస్తారనే ఉద్దేశ్యంతో వినతిపత్రం అందించామని, శాసనసభ్యురాలు సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా పరిశీలించి, పరిష్కారదిశగా ముందుకు తీసుకెళ్తామని చెప్పినందుకు వాకర్స్ క్లబ్ తరుపున, 42వ డివిజన్ ప్రజానీకం తరుపున విజయనగరం శాసనసభ్యురాలు కు ధన్యవాదములు తెలుపుకుంటున్నామని తెలిపారు.

## వృద్ధులే టార్గెట్‌గా సైబర్ నేరాలు

(సి.హెచ్.ప్రతాప్)



నేటి డిజిటల్ యుగంలో సాంకేతిక విప్లవం మానవ జీవనశైలిని ఎంతో సులభతరం చేసినప్పటికీ, అదే సమయంలో నూతన తరహా నేరాలకు మార్గం సుగమం చేసింది. ముఖ్యంగా సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతుండటం సమాజానికి పెద్ద సవాలుగా మారింది. ఈ నేరగాళ్ల ఉచ్చులో ప్రధానంగా వృద్ధులు చిక్కుకోవడం అత్యంత ఆందోళనకరమైన అంశం. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం పట్ల సరైన అవగాహన లేకపోవడం వల్ల, విశ్రాంత జీవనం గడుపుతున్న వృద్ధులు సైబర్ మోసగాళ్ల బారిన సులభంగా పడుతున్నారు. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కేటుగాళ్లు ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారు.

వృద్ధులపై జరిగే సైబర్ దాడులకు వారి అతిగా నమ్మే స్వభావం మరియు కనికరమే ప్రధాన కారణాలు. మోసగాళ్లు తాము బ్యాంకు అధికారులమని, ప్రభుత్వ ప్రతినిధులమని లేదా దూరపు బంధువులమని నటిస్తూ ఫోన్ కాల్స్ లేదా సందేశాల ద్వారా వారిని సంప్రదిస్తారు. “మీ బ్యాంకు ఖాతా నిలిపివేయబడింది” అని భయపెట్టడం లేదా “మీకు భారీ బహుమతి లభించింది” అని ఆశ చూపడం వంటి మాయమాటలతో వారిని బురిడీ కొట్టిస్తారు. ఈ క్రమంలో వారి వ్యక్తిగత వివరాలను, రహస్య ఓటీపీలను సేకరించి, క్షణాల్లో వారి జీవితకాల సంపాదనను కాజేస్తున్నారు. ఇటువంటి ఘటనలు నిత్యం వార్తల్లో నిలుస్తున్నాయి.

మరోవైపు, అత్యాధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతను ఉపయోగించి కుటుంబ సభ్యుల స్వరాలను అనుకరించి మోసం చేసే ధోరణి పెరుగుతోంది. అత్యవసర పరిస్థితిలో ఉన్నామని, వెంటనే డబ్బు పంపాలని కంగారు పెడుతూ వృద్ధులను నమ్మిస్తారు. కుటుంబంపై ఉన్న మమకారంతో వృద్ధులు వెనుకాడకుండా స్పందించి మోసపోతున్నారు. కేవలం ఆర్థిక నష్టమే కాకుండా, ఈ మోసాలు వృద్ధులను మానసిక వేదనకు గురిచేస్తున్నాయి. తమ నమ్మకం వమ్ము కావడంతో వారు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు.

ఈ సైబర్ మహమ్మారిని నివారించాలంటే సామాజిక అవగాహన ఒక్కటే మార్గం. వృద్ధులకు డిజిటల్ భద్రతపై సరైన మార్గదర్శకత్వం అందించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు పంచుకోకూడదని వారికి స్పష్టంగా వివరించాలి. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని, గుర్తు తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించాలి. ఏదైనా ఆర్థిక లావాదేవీ చేసే ముందు కుటుంబ సభ్యులతో చర్చించడం లేదా బ్యాంకుకు వెళ్లి స్వయంగా ధృవీకరించుకోవడం అలవాటు చేయాలి. కుటుంబ సభ్యులు ఈ విషయంలో కీలక బాధ్యత వహించాలి. వృద్ధుల ఆర్థిక వ్యవహారాలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, వారికి సాంకేతిక సాయం అందించాలి. ప్రభుత్వాలు మరియు బ్యాంకులు సైతం వృద్ధుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలి. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయడానికి సులభమైన పద్ధతులను వారికి అందుబాటులోకి తీసుకురావాలి. సాంకేతికతను సురక్షితంగా ఉపయోగించే నైపుణ్యాలను వారికి నేర్పించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపవచ్చు. వృద్ధులు మన సమాజానికి మూలస్తంభాలు మరియు అనుభవజ్ఞులైన మార్గదర్శకులు. వారి గౌరవాన్ని, ఆస్తిని కాపాడటం మనందరి కనీస బాధ్యత. కేవలం చట్టాల ద్వారానే కాకుండా, పరస్పర సహకారం మరియు నిరంతర జాగ్రత్త ద్వారా సైబర్ నేరాలను అరికట్టడం సాధ్యమవుతుంది. సమాజం మొత్తం ఏకమై ఈ డిజిటల్ ముప్పును ఎదుర్కొంటేనే వృద్ధులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించగలము. అవగాహనే సైబర్ నేరాలకు సరైన విరుగుడు.

## దేశచరిత్రలో తొలిసారిగా
# పేదలకు విదేశీ వైద్యం

(సి.హెచ్.ప్రతాప్)




తెలంగాణ రాష్ట్ర చరిత్రలో పేద ప్రజలకు విదేశీ వైద్యం అందించాలనే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఒక మహత్తర మైలురాయిగా నిలుస్తోంది. దేశంలోనే తొలిసారిగా ఇటువంటి వినూత్న పథకాన్ని తెలంగాణలో అమలు చేయడం ద్వారా సంక్షేమ పరిపాలనలో రాష్ట్రం అగ్రగామిగా అవతరించింది. ఇప్పటి వరకు పేదల ఆరోగ్య సంరక్షణ కేవలం దేశీయ వైద్య సేవలకే పరిమితమై ఉండగా ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి అత్యాధునిక చికిత్సలను సామాన్యులకు సైతం అందుబాటులోకి తీసుకురావడం విశేషం. పౌరుల ప్రాణాలకు రక్షణ కల్పించడమే పరమావధిగా ప్రభుత్వం ఈ అడుగు వేసింది.

తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా పేదలకు ఖరీదైన వైద్య సేవలను ఉచితంగా అందిస్తోంది. అయితే కొన్ని అరుదైన అత్యంత క్లిష్టమైన వ్యాధులకు దేశీయంగా సరైన చికిత్స అందుబాటులో లేకపోవడం పెద్ద సవాలుగా మారింది. ఈ గంభీరమైన సమస్యను గుర్తించిన ప్రభుత్వం అటువంటి రోగులను విదేశాలకు పంపించి చికిత్స చేయించేందుకు సాహసోపేతమైన ముందడుగు వేసింది. దేశంలో చికిత్స సాధ్యంకాని తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న పేదలకు విదేశాల్లోని ఉత్తమ వైద్యశాలల్లో చికిత్స అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. సాధారణంగా ఇటువంటి అంతర్జాతీయ స్థాయి వైద్యానికి కోట్ల రూపాయల వ్యయం అవుతుంది. ఇది సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందని ద్రాక్షలా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పూర్తి ఖర్చును భరిస్తూ పేదల ప్రాణాలను కాపాడాలని సంకల్పించింది. కేవలం ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల ఎవరూ కూడా ప్రాణాలు కోల్పోకూడదనేది ప్రభుత్వ ఆశయం.

ఈ పథకం అమలులో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. అర్హులైన పేద కుటుంబాలకు ఎటువంటి భారం లేకుండా పూర్తిగా ఉచితంగా విదేశీ వైద్యం అందించబడుతుంది. ఇందులో భాగంగా రోగి సహాయకుడి ప్రయాణ ఖర్చులు నివాస వ్యయం చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. ప్రతి కేసును ప్రత్యేకంగా నియమించిన వైద్య నిపుణుల కమిటీ సమగ్రంగా పరిశీలిస్తుంది. వ్యాధి తీవ్రత అత్యవసర పరిస్థితి దేశంలో చికిత్స లభ్యత ఆధారంగా రోగులను ఎంపిక చేస్తారు. అంతర్జాతీయ స్థాయి ప్రసిద్ధ ఆసుపత్రులతో ప్రభుత్వం ప్రత్యేక భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుని నాణ్యమైన చికిత్స అందేలా పర్యవేక్షిస్తుంది. విదేశాల్లో చికిత్స ముగిసిన అనంతరం రోగులకు తిరిగి స్వదేశంలో అవసరమైన తదుపరి వైద్య సేవలు అందేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. రోగులకు మనోధైర్యాన్ని ఇస్తూ వారిని విదేశాలకు పంపే ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది.

పథకం అమలులో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడింది. అర్హుల ఎంపికలో ఎటువంటి పక్షపాతం లేకుండా కేవలం వైద్య నిపుణుల సిఫార్సుల మేరకే నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది. దీనివల్ల నిజంగా అవసరమైన బాధితులకు సకాలంలో ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటి వరకు కేవలం అత్యంత ధనికులకు మాత్రమే పరిమితమైన అంతర్జాతీయ వైద్యం ఇప్పుడు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కూడా సాధ్యం కావడం సామాజిక న్యాయానికి గొప్ప నిదర్శనం. ప్రజల నుండి ఎటువంటి పైసా వసూలు చేయకుండా ప్రభుత్వమే భారాన్ని మోయడం గమనార్హం.

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక మార్గదర్శిగా నిలుస్తుంది. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనకాడదని ఈ పథకం స్పష్టం చేస్తోంది. ఆరోగ్య రంగంలో తెలంగాణ సృష్టించిన ఈ కొత్త ప్రమాణం భవిష్యత్తులో మరెన్నో విప్లవాత్మక మార్పులకు నాంది కానుంది. సామాన్యుడి ప్రాణానికి అత్యున్నత విలువను ఇస్తూ అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను ఇంటి ముంగిటకు తెచ్చిన ఈ ఘనత తెలంగాణ ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటి చెబుతోంది. మానవతా దృక్పథంతో రూపొందించిన ఈ పథకం వేలాది కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపుతోంది. తెలంగాణ సాధించిన ఈ విజయం దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గది. దీనివల్ల రాష్ట్ర ఆరోగ్య ముఖచిత్రం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యం సామాజిక బాధ్యతకు అత్యున్నత శిఖరంలా నిలుస్తోంది. చికిత్స కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన అవసరం లేకుండా సామాన్యులకు భరోసా కల్పిస్తోంది. పేదరికం వైద్యానికి అడ్డంకి కాకూడదనే ఉదాత్తమైన ఆలోచనతో ప్రభుత్వం ఈ వ్యవస్థను పటిష్టంగా నిర్వహిస్తోంది. రాష్ట్ర బడ్జెట్ లో వైద్య రంగానికి అధిక నిధులు కేటాయిస్తూ పేదల ప్రాణాలకు రక్షణ కవచంలా నిలుస్తోంది. ఇటువంటి పథకాలు ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ఎంతగానో దోహదం చేస్తాయి. తెలంగాణ రాష్ట్రం చేపట్టిన ఈ అసాధారణ వైద్య సంస్కరణ దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సకాలంలో వైద్యం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్న ప్రస్తుత కాలంలో ఇటువంటి విదేశీ వైద్య సహాయం అభాగ్యులకు వరంలా మారింది. ప్రభుత్వ ఆసుపత్రులలో సదుపాయాలు పెంచడమే కాకుండా అవసరమైనప్పుడు విదేశాలకు పంపే దాతృత్వం ప్రశంసనీయం. ఆరోగ్య తెలంగాణ లక్ష్య సాధనలో ఇది ఒక కీలకమైన అడుగు. సామాన్యుల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం మానవీయ పరిపాలనను అందిస్తోంది. భవిష్యత్తులో కూడా ఇటువంటి ప్రజాహిత నిర్ణయాలు కొనసాగాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# దోషాలు నివారించే గోమతి చక్రాలు

పుట్టా శ్రీనివాసరావు

**గోమతిచక్రాలు శుక్ర గ్రహానికి ప్రతీక. ఒక్క గోమతి చక్రాన్ని తాగే నీళ్ళలో ఉంచి ఆ నీటిని త్రాగటం వలన మనిషిలో రోగ నిరోదక శక్తి పెరిగి అనారోగ్య సమస్యల నుంచి విముక్తి కలుగుతుంది. గోమతిచక్రాన్ని లాకెట్ లాగ ధరిస్తే నర దృష్టి బాధల నుంచి విముక్తి కలుగుతుంది. బాలారిష్ట దోషాలు కూడా పోతాయి.గోమతిచక్రం శ్రీకృష్ణుని చేతిలోని సుదర్శన చక్రాన్ని పోలి ఉంటుంది. దీనినే 'నాగ చక్రం' అని 'విష్ణు చక్రం' అని కూడా అంటారు. ఇది నత్త గుళ్ళని పోలి ఉంటుంది. అందువల్ల దీనిని 'నత్త గుళ్ళ' స్టోన్ అని కూడా అంటారు.**



గోమతి చక్రాలు వెనుక భాగం ఉబ్బెత్తుగాను ముందు భాగం ఫ్లాట్ గాను ఉంటుంది. గోమతి చక్రం ముందుభాగం తెల్ల గాను, కొన్ని ఎర్ర గాను ఉంటాయి. తెల్ల గా ఉన్న గోమతిచక్రాలు అన్ని రకాల పూజా కార్యక్రమాలకి, సకల కార్యసిద్ధికి,ఆరోగ్య సమస్యలకి, ధరించటానికి ఉపయోగపడతాయి.

గోమతిచక్రాలు అరుదైన సహజసిద్ధంగా లభించే సముద్రపు ఉత్పత్తి. గోమతిచక్రాలు గుజరాత్ రాష్ట్రం ద్వారకలోని గోమతి నది లో లభిస్తాయి. చంద్రుడు వృషభ రాశిలోని రోహిణి లేదా తులా రాశిలోని స్వాతి నక్షత్రంలో సంచరించే సమయంలో సోడియం లేదా కాల్షియం లేదా కర్బనపు అణువుల సహాయంతో ఇవి రూపు దిద్దుకుంటాయి.ఈ రెండు రాశులు శుక్రగ్రహానికి చెందినవి కావటం. ఈ శుక్రుడు భార్గవునికి జన్మించిన లక్ష్మీ దేవికి సోదరుడు కావటం వలన ఈ చక్రాల ఉపయోగం అనేకం అనంతం అని చెప్పవచ్చును. జ్యోతిష్యశాస్త్ర రీత్యా శుక్రుడు లైంగిక సామర్థ్యానికి, ప్రేమ, దాంపత్య సౌఖ్యం, సౌభాగ్యాలకు కారకత్వం వహిస్తుండటం వలన గోమతి చక్రాన్ని ధరించిన వారికి పైవన్నీ పుష్కలంగా లభిస్తాయి.

ఎర్రగా ఉన్న గోమతిచక్రాలు వశీకరణానికి, శత్రునాశనానికి, క్షుద్రప్రయోగాలకి, తాంత్రిక ప్రయోగాలకి మాత్రమే ఉపయోగించాలి. గోమతిచక్రాలలో ఆరు, తొమ్మిది సంఖ్యలు అంతర్లీనంగా దాగి ఉన్నాయి . సంఖ్యాశాస్త్రంలో ఆరు శుక్ర గ్రహానికి, తొమ్మిది కుజ గ్రహానికి చెందుతాయి.జాతకంలో కుజ శుక్రులు బలహీనంగా ఉన్నప్పుడు ప్రేమలో విఫలం కావటం ,వివాహం అయిన తరువాత రతికి ఆసక్తిని కనబర్చకపోవటం వంటి దోషాలు సైతం గోమతిచక్ర ధారణవల్ల నివారించబడతాయి.

### పూజా విధానం

గోమతి చక్రాలను సిద్ధం చేసుకున్న తరువాత వాటిని ముందుగా గంగాజలం నీళ్ళతో గాని పసుపు నీళ్ళతో గాని శుద్ధి చేసుకుని పరిశుభ్రమైన బట్టతో తుడవాలి. గోమతిచక్రాలను శ్రీ యంత్రం లేదా అష్ట లక్ష్మీ యంత్రం పీటం మీద గాని ఉంచాలి. గోమతిచక్రాలను లలితా సహస్ర నామంతో జపిస్తూ కుంకుమతో గాని హనుమాన్ సింధూరంతో గాని అర్చన చేయాలి. గోమతి చక్రాల పూజ శుక్రవారం రోజు గాని దీపావళి రోజు గాని, వరలక్ష్మి వ్రతం రోజు గాని చేసుకొని మనకు కావలసిన సమయాలలో వీటిని ఉపయోగించుకోవచ్చు. పూజ చేసిన గోమతిచక్రాలను పూజామందిరంలో గాని బీరువాలో గాని ఉంచి మనకు అవసరమైనప్పుడు వాటిని తీసి ఉపయోగించుకోవచ్చు. గోమతిచక్రాలను ఎప్పుడు ఎర్రని బట్టలో గాని, హనుమాన్ సింధూరంలో గాని ఉంచాలి. గోమతిచక్రాలను పిరమిడ్ లో గాని వెండి బాక్స్ లో గాని ఉంచి కొద్దిగా హనుమాన్ సింధూరం లేదా కుంకుమతో పాటు ఉంచాలి.

### ఉపయోగాలు ఇలా..

రెండు గోమతి చక్రాలను బీరువాలో గాని పర్సు లో గాని ఉంచితే ధనాభివృద్ధి ఉండి ఎప్పుడు ధనానికి లోటు ఉండదు. రెండు గోమతిచక్రాలను భార్యా భర్తలు నిద్రంచే పరుపు కింద గాని దిండు కింద గాని ఉంచినట్టయితే వారిద్దరి మధ్య ఎటువంటి గొడవలు లేకుండా అన్యోన్యంగా ఉంటారు. రెండు గోమతి చక్రాలను ఒక తెల్లని గుడ్డలో వేసి దానిని మీ గుమ్మానికి కట్టండి, నరగోష పటా పంచలైపోతుంది.

మూడు గోమతిచక్రాలను బ్రాస్ లెట్ లాగా చేసుకొని చేతికి ధరిస్తే జనాకర్షణ, కమ్యూనికేషన్, సహకారం లభిస్తుంది. మన దగ్గర అప్పుగా తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వని వారి పేరు గోమతిచక్రాల మీద రాసి నీటిలో వేయటం గాని, వాటిని వెంట పెట్టుకొని డబ్బులు ఇవ్వవలసిన వ్యక్తి దగ్గరకు వెళితే అతను తీసుకున్న డబ్బులను త్వరగా ఇవ్వటానికి అవకాశం ఉంటుంది. ఈ ప్రయోగాన్ని మంగళవారం రోజు చేస్తే ప్రయోజనం కలుగుతుంది.

నాలుగు గోమతిచక్రాలు పంట భూమిలో పొడిచేసి గాని మాములుగా గాని చల్లటం వలన పంట బాగా పండుతుంది. గృహా నిర్మాణ సమయంలో గర్భ స్థానం లో నాలుగు గోమతిచక్రాలు భూమిలో స్థాపించటం వలన ఆ ఇళ్ళు త్వరితగతిన పూర్తి చేసుకొని అందులో నివసించే వారికి సకల ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలిగి ఉందురు. నాలుగు గోమతిచక్రాలను వాహానానికి కట్టటం వలన వాహాన నియంత్రణ కలిగి వాహాన ప్రమాదాల నుంచి నివారించబడతారు.

ఐదు గోమతిచక్రాలు తరుచు గర్భస్రావం జరుగుతున్న మహిళ నడుముకు కట్టటం వలన గర్భం నిలుస్తుంది. 5 గోమతిచక్రాలు పిల్లలు చదుకొనే బుక్స్ దగ్గర ఉంచటం వలన చదువులో ఏకాగ్రత కలుగుతుంది.తరుచు ఆలోచనా విధానంలో మార్పులు ఉంటాయి.పుత్రప్రాప్తి కోసం 5 గోమతిచక్రాలను నది లోగాని జలాశయంలో గాని విసర్జితం చేయాలి.

ఆరు గోమతిచక్రాలు అనారోగ్యం కలిగిన వ్యాదిగ్రస్తుడి మంచానికి కట్టటం వలన తొందరగా ఆరోగ్యం కుదుటపడుతుంది. శత్రువులపై విజయం సాధించవచ్చును. కోర్టు గొడవలు ఉండవు. విజయం సాధించవచ్చును.

ఏడు గోమతిచక్రాలు ఇంటిలో ఉండటం వలన వైవాహిక జీవితం ఆనందంగా ఉంటుంది.ఇతరులతో సామాజిక సంబందాలు బాగుంటాయి.7 గోమతిచక్రాలను నదిలో విసర్జితంచేసిన దంపతుల మధ్య అభిప్రాయభేదాలు మటుమాయం అవుతాయి.

ఎనిమిది గోమతిచక్రాలు అష్టలక్ష్మి స్వరూపంగా పూజిస్తారు. తొమ్మిది గోమతిచక్రాలు ఇంటిలో ఉండటం వలన మన ఆలోచనలని ఆచరణలో పెట్టవచ్చు.ఆద్యాత్మిక చింతన కలుగుతాయి.ఆ ఇంటిలోని వ్యక్తులు గౌరవించబడతారు.

పది గోమతిచక్రాలు ఆఫీసులో ఉండటం వలన ఆ సంస్థకి అమితమైన గుర్తింపు లభిస్తుంది.ఉద్యోగస్తులకు ప్రమోషన్స్ లభిస్తాయి. వారు సమాజంలో గొప్ప పేరు ప్రఖ్యాతలతో గుర్తించబడతారు.

పదకొండు గోమతిచక్రాలు లాభ లక్ష్మి స్వరూపంగా పూజిస్తారు.భవన నిర్మాణసమయంలో పునాదిలో పదకొండు గోమతిచక్రాలను ఉంచటం వలన ఎటువంటి వాస్తుదోషాలు,శల్యదోషాలు ఉండవు.

గోమతిచక్రాలను శివాలయంలో దానం చేసిన ఉద్యోగంలో ప్రమోషన్ వస్తుంది. 27 గోమతిచక్రాలని వ్యాపార సముదాయములలో ద్వార బందానికి కట్టి రాకపోకలు ఆ ద్వారం గుండా చేస్తే వ్యాపారం దినదినాభివృద్ధి అవుతుంది. జాతకచక్రంలో నాగదోషం,కాలసర్పదోషం ఉన్నవారు పంచమస్థానంలో ఉన్న రాహువుకి పాపగ్రహాల దృష్టి గాని,సాంగత్యం గాని ఉన్న సంతాన దోషం ఉంటుంది. దీనినే నాగదోషం అంటారు. జాతకచక్రంలో రాహు కేతువుల మధ్య అన్నీ గ్రహాలు ఉన్నప్పుడు దానిని కాలసర్పదోషం అంటారు. ఈ రెండు దోషాలు ఉన్నవారు గోమతి చక్రాలను పూజచేయటం గాని, దానం చేయటం గాని, గోమతి చక్రాన్ని మెడలో లాకెట్ లాగా ధరించటం గాని చేయాలి. ఈ విధంగా గోమతి చక్రాల వల్ల అనేక లాభాలు ఉన్నాయనీ ప్రముఖ ఆస్ట్రలిజర్,జ్యోతిష్య ప్రవీణ కోరుకొండ సర్వేశ్వరరావు తెలిపారు.

# హజ్ యాత్రికులకు ఆధ్యాత్మిక శిక్షణా తరగతులు

## హజ్ యాత్ర నియమాలు, ఆచారాలు వివరించిన ముఫ్తీలు

## యాత్రికులకు కిట్లు, స్వీట్లు పంపిణీ.. ప్రముఖుల సత్కారం





**విశాఖపట్నం (జయ జయహే)**

ఈ సంవత్సరం పవిత్ర హజ్ యాత్రకు వెళ్లనున్న యాత్రికులకు సమగ్ర అవగాహన కల్పించేందుకు విశాఖపట్నంలో విస్తృత స్థాయిలో శిక్షణా తరగతులు ఘనంగా నిర్వహించబడ్డాయి. యాసీన్ హజ్ కమిటీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ప్రాంతంలోని మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ షాదీఖానాలో జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మికత, క్రమశిక్షణ, సేవాభావం కలిసిన ప్రత్యేక వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా గాజువాకలోని దారుల్ ఉలూమ్ ఇషాక్ నూరియా మదరసా ప్రిన్సిపాల్ ముఫ్తీ మొహమ్మద్ జాఫర్ అలీ హజ్ యాత్రలో పాటించాల్సిన ప్రతి అంశాన్ని స్పష్టంగా వివరించారు. ఇహ్రామ్ ధరించే విధానం, తవాఫ్, సయీ, అరఫాత్ మైదానంలో గడపాల్సిన సమయం, మినాలో ఉండే విధానం వంటి అంశాలపై ఆయన సవివరంగా ఉపన్యాసం చేశారు. యాత్రలో శాంతి, సహనం, క్రమశిక్షణ, పరస్పర గౌరవం ఎంత ముఖ్యమో హాజీలకు తెలియజేశారు.అదనంగా విదేశీ ప్రయాణంలో ఎదురయ్యే సవాళ్లు, ఆరోగ్య పరిరక్షణ, సమయపాలన, సమూహంగా కదలికలు, భద్రతా సూచనలు వంటి అంశాలపై కూడా ప్రత్యేక మార్గదర్శకాలు అందించారు. హజ్ యాత్ర కేవలం ఒక ప్రయాణం మాత్రమే కాకుండా, మనస్సు మరియు ఆత్మ శుద్ధికి దారితీసే పవిత్ర ఆచరణ



అని, జీవితంలో ఒకసారి లభించే ఈ అవకాశాన్ని సార్థకం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ. రెహమాన్, యాసీన్ హజ్ కమిటీ అధ్యక్షుడు అహ్మదుల్లా ఖాన్, కార్యదర్శి రెహమతుల్లా బేగ్, హాజీ మీర్ అబ్బాస్ హుస్సేన్, అబ్దుల్ మునీర్ ముషాద్ తదితరులు పాల్గొని హాజీలకు శుభాకాంక్షలు తెలిపారు. హజ్ యాత్ర విజయవంతంగా, సాఫల్యంగా పూర్తవ్వాలని ఆకాంక్షించారు.అనంతరం సుఖీభవ సంస్థ డైరెక్టర్ హాజీ మీర్ అబ్బాస్ హుస్సేన్ తన స్వంత నిధులతో హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు హజ్ కిట్లు, అవసరమైన వస్తువులు, స్వీట్లు పంపిణీ చేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ పంపిణీ కార్యక్రమం హాజీలలో ఆనందాన్ని నింపింది.చివరిగా హాజీలకు శిక్షణ అందించిన ముఫ్టీ జాఫర్ అలీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన యాసీన్ హజ్ కమిటీ అధ్యక్షుడు అహ్మదుల్లా ఖాన్, కార్యదర్శి రెహమతుల్లా బేగ్ గారిని హాజీ మీర్ అబ్బాస్ హుస్సేన్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ తరహా శిక్షణా కార్యక్రమాలు హజ్ యాత్రికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండి, యాత్రను సక్రమంగా నిర్వహించేందుకు మార్గదర్శకంగా నిలుస్తాయని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం హజ్ యాత్రికుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది.



## పుష్కరణి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**చోడవరం ఏప్రిల్ 3, జయ జయహే**

చోడవరం పట్టణంలో వెలసిన శ్రీ గంగా సమేత గౌరీశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ప్రారంభమైన పుష్కరిని పనులను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు తగు సూచనలు చేశారు ఈ పుష్కరిని అభివృద్ధికి ప్రభుత్వం 50 లక్షల రూపాయలు మంజూరు చేసింది. దీంతో ప్రస్తుతం పుష్కర్ణి చెరువులో మట్టిని , బురదను చుట్టూ ఉన్న మొక్కలను తొలగిస్తున్నారు. అధునాతన విధానాలతో భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండే విధంగా ఈ పుష్కర్ని తయారు చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలోఆలయం కమిటీ చైర్మన్ గూనూరు సురేష్, చోడవరం పిఏసిఎస్ అధ్యక్షులు గూనూరు మూలునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యన్నా... డప్పు కొట్టే

# దళితుడిపై దౌర్జన్యమా...!

### స్పీకర్ హోదాకే అవమానం కాదా

### ఇదేనా నీ పదవి అహంకారం

### సుమోటాగా పోలీస్ కేసు నమోదు చేయాల్సిందే

### బహిరంగ క్షమాపణ చెప్పండి

### విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి డిమాండ్

**విశాఖపట్నం, ఏప్రిల్ 3, జయ జయహే :**



జాతరలో డప్పుకొట్టే దళితుడిని చెంప దెబ్బలు కొట్టిన స్పీకరు అయ్యన్న పాత్రుడు బహిరంగ క్షమాపణ చెప్పాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యున్నత పదవిలో ఉండి విజ్ఞతతో ఉండాల్సిన వ్యక్తులు ఉత్సవంలో డప్పు కొట్టే మైలపల్లి దాసును అవమానకరంగా బహిరంగంగా జాతరలో కొట్టడం అమానుష నేరపూరితంగా వుందన్నారు. ఈ సంఘటనకు స్పీకర్ హోదాలో ఉన్న అయ్యన్న పశ్చాత్తాపం చెందకుండా తిరిగి బాధితుడి చేత వీడియోలో మాట్లాడించి ఆ నేరపూరిత ఘటనను చిన్నది లేదా ఎవరో రాజకీయం చేస్తున్నారని చిలకపలుకులు పలికించడం వల్ల పోలీసు పిర్యాదు నుండి తప్పించుకోగలరు కాని దళిత సమాజం మిమ్మల్ని ఉపేక్షించదని హెచ్చరించారు. ఆయనపై నర్సీపట్నం పోలీసులు సుమోటోగా కేసు పెట్టాలన్నారు . ఈ ఘటనకు ఖచ్చితంగా అయ్యన్న పాత్రుడుదే బాధ్యత అని వెంకట రావు నొక్కి చెప్పారు.. బేషరతుగా బహిరంగంగా బాధితుడికి క్షమాపణ చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని హితవు పలికారు. స్పీకరు అయ్యన్న స్పందించక పోతే దళిత సంఘాలు పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డెక్కుతాయని హెచ్చరించారు. ఇలా రోడ్లపై చిల్లర చేష్టలు చేస్తున్న అయ్యన్న పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



## రాజధాని విషయంలో వైసీపీ కుట్రలు

### మంత్రి నాదెండ్ల మనోహర్ ధ్వజం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలో వైసీపీ అనేక కుట్రలకు పాల్పడిందని మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్రంగా ఆరోపించారు. చీలికలు తెచ్చి ఓట్లు సాధించాలని వైసీపీ వివిధ ప్రయత్నాలు చేసిందని విమర్శించారు.ఐదేళ్ల వైసీపీ పాలనలో అమరావతిలో ఒక ఇటుక కూడా వేయలేదని, ఇప్పుడు మాత్రం విమర్శలు చేయడం దురదృష్టకరమని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బెంగళూరులో నివాసం ఉంటూ అమరావతి అంశంపై మాట్లాడటం తగదని వ్యాఖ్యానించారు.అమరావతిని రాజధానిగా చట్టబద్ధంగా కేంద్రం సలహాతోనే తీసుకువచ్చామని స్పష్టం చేసిన మంత్రి, ఇకపై అమరావతి అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని, రాజధానిని అక్కడి నుంచి కదిలించడం అసాధ్యమని తెలిపారు.జగన్ వ్యాఖ్యలు పైశాచిక ఆనందంతో చేసినవేనని విమర్శిస్తూ, వైసీపీకి గట్టి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే వైసీపీ తీరును ఇప్పటికైనా ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు.ఇదిలా ఉండగా, రాబోయే స్థానిక సంస్థల, అసెంబ్లీ ఎన్నికలు మరియు డిలిమిటేషన్ పరిణామాలపై పవన్ కళ్యాణ్ కమిటీ ఏర్పాటు చేయడం ప్రస్తావించారు. ఈ పరిణామాలు జనసేనకు మంచి అవకాశాన్ని తీసుకురానున్నాయని చెప్పారు.అసెంబ్లీ సీట్లు పెరగడం వల్ల మహిళలు, యువతకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.



## మర్రిపాడు గ్రామ విద్యుత్తు సమస్య తీరింది

### 30 లక్షలతో 63 కె.వి ట్రాన్స్ఫార్మ్ ఏర్పాటు

### రాష్ట్ర వ్యవసాయ మంత్రికి కృతజ్ఞతలు తెల్పిన ప్రజలు

**టెక్కలి ఏప్రిల్ 3 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాలి మండలం మర్రిపాడు గ్రామంలో దీర్ఘకాలికంగా స్థానికులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు చొరవతో తమ గ్రామంలో విద్యుత్ వెలుగులు వచ్చాయని స్థానిక సర్పంచ్, సంతబొమ్మాలి మండల మాజీ పిఏ సిఎస్ అధ్యక్షులు ఆట్టాడ రాంప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. మర్రిపాడు గ్రామంలో 30 లక్షల వ్యయంతో 63 కె.వి ట్రాన్స్ఫారం ఏర్పాటుచేసి వేసవిలో విద్యుత్తు కోతలు లేకుండా చేశారని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి కింజరాపు అచ్చం నాయుడు కు రుణపడి ఉన్నామని విద్యుత్తు సత్వర పరిష్కారం జరగడం చాలా హర్షదాయకమని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో జూనియర్ లైన్మెన్ వినోద్, కాంట్రాక్టర్ పాపారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పంచాయతీల స్పెషలాఫీసర్లుగా మండలాధికారుల నియామకం

### జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు

**కొయ్యూరు :(జయ జయహే )న్యూస్ ఏప్రిల్ 04**



పంచాయతీ సర్పంచ్ పదవీకాలం ఈనెల 2వ తేదీతో పూర్తి కావడంతో, ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు స్థానిక ఎంపిడిఓ జీ.డి.వి. ప్రసాదరావు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. మూడవ తేదీ శుక్రవారం నుండి స్పెషల్ ఆఫీసర్లు బాధ్యతల స్వీకరించనున్నారు. రాజేంద్రపాలెం,కొమ్మిక, కొండ గోకిరి, మంపా, కంఠరం, కినపర్తి పంచాయతీలకు ఎంపీడీఓ జి.డి.వి ప్రసాద్ రావు ను, ఆడాకుల, అంతాడా, బాలారం, బకులూరు, బంగారంపేట పంచాయతీలకు తహసిల్దార్ పి. మురళి బాబును, చింతలపూడి, చిటింపాడు, డౌనూరు, గదపాలెం, రత్నంపేట పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీఓ టి. శ్రీనివాసరావు, మఠం భీమవరం, ఆర్. కొత్తూరు, శరభన్నపాలెం,వెలగల పాలెం, పంచాయతీలకు అడ్మినిస్ట్రేటివ్ అధికారి డి. బాల మురళీకృష్ణ ను, బూదరాళ్ల, కొయ్యూరు , రేవళ్లు పంచాయతీలకు ఎస్ఎంఐ జైఈ సి.హెచ్. రామకృష్ణ, బట్ట పనుకుల, చీడిపాలెం, ఎం. మాకవరం, మర్రివాడ, పంచాయతీలకు ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ ఎస్. శ్రీ సాయి కృష్ణను, నడింపాలెం, నల్లగొండ, పి.మాకవరం, రవణా పల్లి పంచాయతీలకు వ్యవసాయ అధికారి ఈ. శివరాం ప్రసాద్ లకు ప్రత్యేక అధికారి బాధ్యతలు మూడో తేదీ శుక్రవారం నుండి పంచాయితీ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ద్వారా తెలియజేసినట్లు ఎంపీడీవో ప్రసాద్ ప్రకటన ద్వారా తెలియజేశారు. పంచాయతీల అభివృద్ధి నిమిత్తం వీరికి చెక్ పవర్ కలుగజేశారు.

# ప్రారంభమైన బిజెపి శిక్షణా తరగతులు





**అనకాపల్లి,ఏప్రిల్ 3 జయ జయహే**

బిజెపి దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ మహా అభియాన్ కార్యక్రమం శుక్రవారం అనకాపల్లిలో నిర్వహించారు. రెండు రోజులు పాటు దేశవ్యాప్తంగా మండల స్థాయిలో కార్యకర్తలకు శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా 90 రోజులు పాటు గ్రామాలలో కార్యకర్తలు చేపట్టవలసిన కార్యక్రమాలు , రాష్ట్రంలో బిజెపి చేస్తున్న కార్యక్రమాలు, సోషల్ మీడియా విధివిధానాలు, స్పెషల్ ఇంసెంటివ్ రివిజన్ వంటి వాటిపై తొలిరోజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి సీనియర్ నాయకుడు విశాఖ జిల్లా పార్టీ ఇన్చార్జి అయిన పుట్ట గంగయ్య హాజరై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సోషల్ మీడియా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల పరిస్థితి చూసి సిగ్గుపడుతున్నా





## నా తల దించుకుంటున్నా

### సౌకర్యాల లేమి పట్ల ఎమ్మెల్యే గంటా ఆగ్రహం

### బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం

**సింహాచలం, ఏప్రిల్ 3, జయ జయహే**

సింహాచలంలో ప్రఖ్యాతిగాంచిన మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో నెలకొన్న దయనీయ పరిస్థితుల పట్ల భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించడానికి సైతం భయపడేలా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. డార్మెటరీలు టాయ్ లెట్లు, కిచెన్, స్టోర్ రూం లను పరిశీలించారు. డార్మెటరీలో బెడ్స్ విద్యార్థులు వాడుకోవడానికి వీలు లేని దారుణమైన స్థితిలో ఉన్నాయన్నారు. తీవ్ర దుర్గంధం వల్ల టాయ్ లెట్ల దగ్గరకు వెళ్లలేని దుస్థితి ఉందని.. ప్రిన్సిపాల్ కు తప్పదు కాబట్టి తనతో వచ్చారని, కేడర్ కూడా కలిసి రాలేనంత ఘోరంగా టాయ్ లెట్ల పరిసరాలు ఉన్నాయని అసంతృప్తి వ్యక్త పరిచారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితులు ఉండడం చాలా అవమానకరంగా ఉందన్నారు. నిద్రపోతున్న విద్యార్థులను ఎలుకలు కొరకడం అత్యంత బాధాకరమైన విషయంగా గంటా చెప్పారు. సిగ్గుతో తలదించుకునేలా ఉన్న గురుకుల పాఠశాల సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కిచెన్, స్టోర్ కొంత పర్వాలేదని, ఎలుకల సమస్య పరిష్కారానికి చర్యలు మొదలుపెట్టారని చెప్పారు. విద్యా, వైద్య రంగానికి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చుచేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఉపాధ్యాయులు ఉంటారని, ఉచిత మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు ఉన్నా.. పిల్లల భవిష్యత్ బాగుండాలని 90 శాతం మంది పేద తల్లిదండ్రులు లక్షల ఫీజులు కట్టి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారని చెప్పారు. అనంతరం విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పురుషోది, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, పీవీ నరసింహం, గాడు చిన్ని కుమారి లక్ష్మి, కంటుభుక్త రామానాయుడు, పంచదార్ల శ్రీనివాస్, గుసిడి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు



## బ్రహ్మానందం కామెడీ లోటును భర్తీ చేస్తున్న జగన్

### - అప్పుడు విశాఖ.. ఇప్పుడు మావిగన్

### - బ్రహ్మానందాన్ని తలపిస్తున్న జగన్ వ్యాఖ్యలు

### - ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆరోపణ

**విశాఖపట్నం, ఏప్రిల్ 3, జయ జయహే**

అధికారంలో ఉండగా విశాఖను రాజధానిగా ప్రకటించిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు మావిగన్‌ను రాజధాని చేయాలని యు టర్న్ తీసుకుని విశాఖను వదిలేశారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం ఎంవీపీలోని ఆయన ఇంట్లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాజధాని విషయంలో జగన్మోహన్ రెడ్డి మాటలు మారుస్తూ ఊసరవిల్లిని మించిపోయారని పేర్కొన్నారు. అమరావతి రాజధానిగా స్వాగతిస్తున్నామని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన జగన్ 2019 లో అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ పరిపాలన రాజధాని అంటూ మాట మార్చారన్నారు. తాజాగా మచిలీపట్నం - విజయవాడ - గుంటూరు (మావిగన్) ను రాజధాని చేయాలని ప్రతిపాదించారంటే విశాఖ వద్దని పరోక్షంగా చెప్పినట్టేనని పేర్కొన్నారు. ఆల్ ఫూల్స్ డే ఏప్రిల్ 1వ తేదీన మావిగన్ ను రాజధాని చేయాలనడం ఆయన మానసిక స్థితిపై అనుమానం రేకెత్తిస్తోందన్నారు. సినీ నటుడు బ్రహ్మానందం సినిమాలు తగ్గించిన లోటును జగన్మోహన్ రెడ్డి తన కామెడీతో భర్తీ చేస్తున్నారని చెప్పారు . విశాఖ ఎయిర్ పోర్టు ఈగలు తోలుతుంటే భోగాపురంలో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ఎందుకని.. ఎర్ర బస్సు రాని భోగాపురానికి ఎయిర్ బస్సు ఎందుకని.. ప్రశ్నించిన జగన్ ఆ తర్వాత మాట మార్చి భోగాపురం ఎయిర్ పోర్టు రావడానికి కారణం తానేనని చెప్పుకోవడం ఆత్మవంచనగా వ్యాఖ్యానించారు. ఒరిస్సాలో లక్ష కోట్లతో స్టీల్ ప్లాంటు ఏర్పాటు చేసిన నిప్పాన్ అనకాపల్లి జిల్లాలో ఎందుకు ప్రతిపాదిస్తుందని వెటకారంగా ప్రశ్నించిన జగన్.. ఆ ప్లాంట్ కు శంకుస్థాపన చేయడంతో దావోస్ లో మిట్టల్ తో మాట్లాడి స్టీల్ ప్లాంట్ తీసుకువచ్చింది తానేనని చెప్పుకోవడం దిగజారుడుతనమన్నారు. గూగుల్ డేటా సెంటర్ విషయంలోనూ క్రెడిట్ చోరీకి పాల్పడ్డారని చెప్పారు. కూటమి నాయకులు పంచకర్ల సందీప్, చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, పీవీ నరసింహం, శాఖారి శ్రీనివాస్, లొడగల అప్పారావు, కంటుభుక్త రామానాయుడు, కాళ్ల నగేష్ కుమార్, మొల్లి లక్ష్మణరావు, నాగోతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## యువతకు స్వీయ రక్షణ అవసరం

### అత్యవసర సమయంలో పోలీస్ సేవలు తీసుకోవాలి

**టెక్కలి ఏప్రిల్ 3 జయ జయహే**


గ్రామీణ నగర ప్రాంతాల్లో అత్యవసరమైన సమయాల్లో పోలీస్ శాఖ అందించే సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని టెక్కలి సబ్ డివిజన్ పోలీస్ శాఖ ప్రతినిధులు శక్తి టీం అవగాహన కార్యక్రమాలు ద్వారా తెలియజేశారు. జలుమూరు మండలం చల్లవానిపేట శ్రీరామ హృదయ ఏపీఆర్జేసీ పాలిటెక్నిక్ కోచింగ్ కేంద్రంలో శక్తి టీం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. యువతి యువకులు, బాల బాలికలు కు స్వీయ రక్షణ చాలా అవసరమని హోలీ సేవలను సంబంధిత నెంబర్లు వినియోగించి ప్రమాద పరిస్థితుల్లో శక్తి టీం సేవలను పొందాల్సిన అవసరం ఎంతో ఉందని టెక్కలి పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గిరిధర్ తెలిపారు. జాతీయ రహదారి రహదారి భద్రత హెల్ప్ లైన్ 1033, పోలీస్ హెల్ప్ లైన్181, 1092, బాల కార్మికులు మరియు వివాహనను అరికట్టడం కోసం 1098, మాదకద్రవ్యాల నిషేధం రిప్లై 1972, నెంబర్లకు ఫోన్ చేసి సమాజంలో బాధ్యతగల పౌరులుగా తక్షణ స్వీయ రక్షణ పొంది ,అత్యవసర పరిష్కారాలకు పోలీస్ సేవలు వినియోగించుకోవాలి శక్తి టీం ప్రతినిధులు వివరించారు, ఈ కార్యక్రమంలో ఎం గిరిధర్ తో పాటు కోటబొమ్మాలి హెడ్ కానిస్టేబుల్ కే గణేష్, మహిళా కానిస్టేబుల్ ఎం చామంతి, ఇన్స్టిట్యూట్ ఆర్గనైజర్స్ కొల్లి సూర్యనారాయణ రావు, ఆట్ల జనార్ధన రావు సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్‌ని విమర్శించే అర్హత ఎమ్మెల్యే నాయకర్‌కు లేదు

### వైసీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు పెండ్ర వీరన్న

**పశ్చిమగోదావరి జిల్లా( జయ జయహే)**

నరసాపురంలో స్థానిక శాసన సభ్యులుగా బొమ్మిడి నాయకర్ ఇటీవల జరిగిన సీతారామపురం సౌత్ గ్రామంలో దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం పై జరిగిన దాడి పై మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించడం జరిగింది. ఈ సందర్భంగా నరసాపురం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు . ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఆ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ని విమర్శించే అర్హత స్థానిక ఎమ్మెల్యేకి లేదన్నారు. అలాగే ఇటీవల సితారామపురం సౌత్ లో దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం పై జరిగిన దాడిలో నలుగురు విద్యార్థులు దొరికినట్లు పోలీసు నిర్ధారణ చేసారని చెప్పారన్నారు. ఆ నలుగురు విద్యార్థులు చదువుకునే




విద్యార్థులు కావడంతో వారి భవిష్యత్తు పాడైపోకూడదన్న ఉద్దేశంతో పోలీసు సమక్షంలో ఆ విషయాన్ని సామరస్యకంగా పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే నాయకర్ ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో మాజీ సీఎం జగన్ ని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించడం సరికాదని హితవు పలికారు. ఎమ్మెల్యేగా గెలిచి రెండు సంవత్సరాలు గడుస్తుందని నేటికీ నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పనికూడా జరగలేదని ప్రజలే బాహాటంగా చెప్తున్నారని ఆయన అన్నారు. అంతేకాకుండా మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్లబ్బులు, పేకాట స్థావరాలు ఎక్కువైపోయాయని ఏనాడు నరసాపురం నియోజకవర్గం లో ఆ విష సంస్కృతి లేదని వీరన్న అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా నరసాపురం నియోజకవర్గంలో ఒక చారిత్రాత్మకమైన మార్పు తీసుకొచ్చామని అందులో భాగంగానే, నరసాపురం మెయిన్ సెంటర్ లో ఉన్న బస్ కాంప్లెక్స్, గవర్నమెంట్ హాస్పటల్ లను అభివృద్ధి చేయడంతో పాటు ఆక్వా యూనివర్సిటీ, ఫిషింగ్ హార్బర్, వశిష్ట వారధి తదితర పనులకు శ్రీకారం చుట్టారని పెండ్ర వీరన్న గుర్తు చేశారు. నేటికైనా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టి నియోజకవర్గంలో బలహీన వర్గాల ప్రతినిధిగా మీకు అవకాశం ప్రజలు ఇచ్చారని ఇచ్చినటువంటి అవకాశాన్ని నియోజకవర్గ అభివృద్ధిలో చూపెడితే బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమం లో అగ్నికుల క్షత్రియ విభాగం రాష్ట్ర అధ్యక్షులు తిరుమాని నాగరాజు , రాష్ట్ర మాజీ ఆప్కాబ్ చైర్మన్ అంద్రాజు చల్లారావు మాట్లాడే రు ఈ కార్యక్రమంలో పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ పిడి రాజు , కామన బాల సత్యనారాయణ,, కడలి రాంబాబు , పులపర్తి ప్రతాప్ , మహిళా బత్తుల శ్రీనివాస్ , కంకటాల పెద్దిరాజు , గుడిసె నాగరాజు , చినిమిల్లి చందు , అడ్డాల నరసింహారావు , కడలి అబద్ధం , చెరుకూరి ప్రసాద్ రాజు , తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్‌ను కలసిన

## బిల్డర్స్ ప్రతినిధులు

**విశాఖపట్నం ఏప్రిల్ 3, జయ జయహే :**

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌ను బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ ప్రతినిధులు శుక్రవారం కలిశారు. విశాఖ మహా నగర అభివృద్ధికి తోడ్పడాలని ఈ సందర్భంగా కోరారు. కలెక్టర్‌ను కలసిన వారిలో సభ్యులు కాశీ విశ్వేశ్వరరావు, మాడ నారాయణ మూర్తి, కె. వెంకటేశ్వర్లు, జీవీ రవిరాజు, ఎ. చిన్నారావు రెడ్డి, సీహెచ్ మంగపతిరావు, జి. పోతన రెడ్డి, బీవీఎస్ సుబ్బరాజు తదితరులంతా పూల బొకేలందించి పరిచయం చేసుకుని సన్మానించారు.



## ట్రాఫిక్..రోడ్డు కండిషన్ చూసి బస్సులు నడపండి...!

### డ్రైవర్లకు ఆర్టీసీ ఆర్ ఎం అప్పలనాయుడు పిలుపు

**విశాఖపట్నం, ఏప్రిల్ 3, జయ జయహే**

రోడ్డు కండిషన్ చూసి బస్సులను నడపాలని ఏపీఎసఆర్టీసీ రీజనల్ మేనేజర్, బి.అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం విశాఖ జిల్లాలోని అన్ని డిపోల నుండి వచ్చిన డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకము, దివ్యాంగ శక్తి పథకము వచ్చిన తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, ప్రతి డ్రైవర్ కూడా ఆర్టీసీ బస్టాప్‌ల వద్ద ఆపి వారిని తప్పనిసరిగా బస్సుల్లో సర్దుకునేలాగా వాళ్ళకి ఎప్పటికప్పుడు విజ్ఞప్తి చేస్తూ ప్రయాణికుల మన్నన పొందాలన్నారు. బస్సులను ఎప్పటికప్పుడు తగినన్ని రిపేర్లు చూసుకుంటూ మంచి కండిషన్లో ఉంచాలని, గాలిలో పొగ కాలుష్యం లేకుండా బస్సును అధిక స్పీడ్ తో నడపకుండా, రోడ్డు కండిషన్ బట్టి ట్రాఫిక్ కండిషన్ బట్టి నడిపి మంచి డీజిల్‌ను పొదుపు చేయాలని కోరారు. రానున్న కాలంలో డీజిల్, గ్యాస్ రేట్లు పెరిగే అవకాశం ఉంటాదని అందుకు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైవర్లు ఏకాగ్రతతో మంచి ఆరోగ్యం ఉండుటకు మంచి అలవాట్లు చేసుకోవలని, ఈ వేసవిలో ఎప్పటికప్పుడు మజ్జిగ ప్యాకెట్లు ఉంచుకొని తాగాలని, మెడికల్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ వాల్తేర్ కె.సుధాకర్, రీజనల్ సేఫ్టీ ఇన్‌స్ట్రక్టర్ ఎం శంకర్రావు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టటర్ వైఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.




## కొత్తబల్లుగుడలో ఘనంగా గుడ్ ఫ్రైడే

**అరకులోయ: జయ జయహే**

అరకు వేలి మండల కేంద్రం కొత్తబల్లుగూడ గ్రామం నందు శుక్రవారం గుడ్ ఫ్రైడే ఆరాధనను హార్ట్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్ అండ్ వెల్ఫర్ సొసైటీ ఫౌండర్ అండ్ డైరెక్టర్ బిషఫ్ . బారికి మణిక్యం చర్చి నందు పాల్గొని ఈ సందర్భంగా ప్రార్ధన చేసి వారు మాట్లాడుతూ. శాంతికి సహనానికి ప్రాణం త్యాగానికి మానవ జాతి కోసం ప్రాణమునే పెట్టిన గొప్ప దేవుడు యేసు క్రీస్తు ప్రభువు మంచి మార్గం చూపి ప్రజలందరి దగ్గర పేరు పొందిన దేవుడు యేసు క్రీస్తు ప్రభువు అని వారు అన్నారు. మన వారి కొరకు ప్రాణం పెట్టిన దినమును బట్టి మనకు శుభ శుక్రవారం అని వచ్చిందని ఈ శుభ శుక్రవారం ద్వారా అనేకమందికి ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటున్నాము. ఈ మంచి బాటలో నడవాలని ప్రసంగించారు. ఈ దైవ మందిరంలో విశ్వాసులు పాల్గొని దేవుడుని ఆరాధించారు. అనంతరం అక్కడ విచ్చేసిన ప్రజలను భోజనాలు పెట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో సంఘం పెద్ద సంజీవ్ కుమార్. కిషోర్. జ్ఞానమ్మ. నిర్మల. సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా శబలా భోజనాల సంబరాలు





## జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన భోజనం

### మన ప్రకృతి వనరుల పరిరక్షణ బాధ్యత మనదే : చిరంజీవి చౌదరి

**సింహాచలం (జయ జయహే)**

విజయవంతంగా శబలా భోజనాల సంబరాలు నిర్వహించుకున్నారు అని ఫుడ్ ప్రాసెసింగ్ రాష్ట్ర విభాగం కార్యదర్శి చిరంజీవి చౌదరి అన్నారు. శుక్రవారం ఉదయం సింహాచలం గోశాల వద్ద సేవ్ సంస్థ నిర్వహించిన శబల భోజనాల పండుగ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తండోపతండాలుగా తరలివస్తున్న అభిమానులను చూస్తుంటే ప్రకృతి వ్యవసాయదారుల మీద పెరుగుతున్న అభిమానానికి నిదర్శనం అన్నారు. ఈ భోజనాలు పండుగ జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది అన్నారు. మన ప్రకృతి వనరుల పరిరక్షణ బాధ్యత మనదే అన్నారు.భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జలగం కుమారస్వామి మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా మాత్రమే పంటలు పండించడం అవసరం అన్నారు. వేలాది మంది ఈ భోజనాలు పండుగను జయప్రదం చేయడం ఆనందంగా ఉ ంది అన్నారు.ఆంధ్రా విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి జి ఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా వ్యవసాయం చేయడం అవసరం అన్నారు. దీనిని దృష్టిలో ఉ ంచుకుని ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతుల సంఖ్య పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం, మిలెట్స్ రాంబాబు, ఆయుర్వేద వైద్యులు సుందరరాజ పెరుమాళ్, జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్ర ధామా, వీఎంఆర్ డిఎ చీఫ్ అర్బన్ ప్లానర్ వి.శిల్ప, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ ప్రసాద్, విశాఖ పోర్టు ట్రస్టు ఉద్యానవన అధికారి రాధిక, ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం ఉత్తర ఆంధ్ర అధికారి జనార్దన్ లు మాట్లాడారు. అతిధులకు ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు డా " ఎం.అర్.యన్.వర్మ తమ సంస్థ యుజెఫ్ మీడియా డైరీలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సంకల్ప కళా గ్రామం ప్రతినిధి ఆకుల చలపతి రావు, తులసి నేచురల్స్ సత్యనారాయణ, మేంగో మేన్ అప్పాజీ, దేశీయ ఆవులు ప్రదర్శన నిర్వహించిన మహేష్ , మేడ్ గార్డెనర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సీతారామలయం

# మూడవ వార్షికోత్సవం

### భక్తులతో కళకళలాడిన ఆలయం

**బుచ్చయ్యపేట ( జయ జయహే)**

బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెం కొత్తూరు గ్రామంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ కోదండ సీతారామలయం మూడవ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు భారీగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రసాదం స్వీకరించారు. అనంతరం సీతారాముల వారి సారి ఊరేగింపు కార్యక్రమం గ్రామంలో భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. ఈ మహోత్సవాన్ని గ్రామ పెద్దలు, యువత, మహిళలు అందరి సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి స్థలం అందించిన స్థలదాత కొల్లిమల్ల అప్పారావుకు గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# కైలాసగిరి టోల్ ప్లాజా బాదుడు

### కారులో ఎంత మంది ఉంటే అన్ని రూ. 10 వసూళ్లు...!

### పాత టికెట్ విధానమే బెటర్

### రద్దు చేయకపోతే ఆందోళన చేపడతాం

### వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

**విశాఖపట్నం, ఏప్రిల్ 3, జయ జయహే**



కైలాసగిరి పర్యాటక ప్రాంతంలో ఇటీవల అమలు చేస్తున్న కొత్త టికెట్ విధానం, పార్కింగ్ ఛార్జీలు, వివిధ రకాల అదనపు వసూళ్లు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పేర్కొన్నారు. ఎలాంటి ముందస్తు ప్రకటనలు లేకుండా, ప్రజలకు కనీస సమాచారం ఇవ్వకుండానే ఈ విధానాన్ని అమలు చేయడం దారుణమన్నారు. ఇప్పటివరకు వాహనాలకు మాత్రమే టోల్ రుసుం వసూలు చేయగా, తాజాగా వాహనంలో ప్రయాణించే ప్రతి వ్యక్తిపై అదనంగా రూ.10 చొప్పున వసూలు చేయడం అన్యాయంగా ఉందన్నారు. ఈ నిర్ణయం కారణంగా కుటుంబాలతో, స్నేహితులతో కలిసి వచ్చే పర్యాటకులు అనవసర ఆర్థిక భారం భరించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు విశ్రాంతి, వినోదం కలిగించే ప్రదేశంగా ఉ ండాల్సిన కైలాసగిరిని ఆదాయ వనరుగా మార్చి సాధారణ ప్రజలపై భారాలు మోపడం సరైన విధానం కాదన్నారు. ఇలాంటి చర్యలు పర్యాటక అభివృద్ధికి ప్రతికూలంగా మారడమే కాకుండా ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నందున వెంటనే ఈ పెరిగిన టికెట్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.



# ద్రాక్షారసం పంపిణీ

### వేసవికాలంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలి

**పెదకూరపాడు,ఏప్రిల్ 3 జయ జయహే**

వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాహనదారులకు, బాటసారులకు, వలస కూలీలకు ద్రాక్షరసం పంపిణీ అభినందనీయమని ఎస్పీ అసోసియేట్స్ పార్టనర్ ఎన్ నరేంద్రబాబు అన్నారు. జనచైతన్య సమితి ఆధ్వర్యంలో పెదకూరపాడు ఆర్ అండ్ బి రోడ్డు పక్కన నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద గుడిపూడి కాంతారావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారముతో శుక్రవారం అందించిన ద్రాక్షారాసాన్ని పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎల్లలచెరువు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు ద్రాక్ష రసం కూడా ప్రజలకు అందిస్తూ నిర్వాహకులు మార్గదర్శకంగా ఉన్నారన్నారు. ఈకార్యక్రమంలో జనచైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది వేసవి కాలంలో ప్రజలు ఇబ్బందులు పడకూడదని గత మూడు సంవత్సరాలుగా చలివేంద్రం ద్వారా ప్రజల దాహార్తిని తీరుస్తున్నామని దాతల సహకారంతో మజ్జిగ, నిమ్మరసం,ద్రాక్షారసంతో పాటు పలు రకాల చల్లని పానీయాలను అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మంచినీళ్ల శ్రీధర్, జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్,షేక్ సుభాని ద్రాక్షారసానికి సహకరించిన గుడిపూడి సాగర్ బాబు, వేరిచెర్ల వంశి తదితరులు పాల్గొన్నారు.

# బాబు..లోకేష్ మెప్పు కోసం గంటా తాపత్రయం

### వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

**విశాఖపట్నం, ఏప్రిల్ 3, జయ జయహే :**



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ మెప్పుకోసం మాత్రమే గంటా శ్రీనివాసరావు తాపత్రయం పడుతున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు విమర్శించారు. మాజీ సీఎం జగన్‌పై గంటా శుక్రవారం విలేకరుల సమావేశంలో చేసిన ఆరోపణలను ఖండించారు. గంటా చేసిన ప్రేలాపనలు ఆపకపోతే తగు రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి విశాఖ ప్రజల మద్దతు తీసుకున్న గంటా అదే విశాఖను రాజధానిగా సమర్థించకుండా అమరావతి వైపు మొగ్గు చూపడం విశాఖ ప్రజల విశ్వాసానికి చేసిన మోసం అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది ప్రజల ప్రయోజనాల కోసం కాదని కేవలం నారా చంద్రబాబు నాయుడు, లోకేష్ మెప్పు కోసం, వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం చేసిన వ్యాఖ్యలు మాత్రమే అని ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విశాఖ ను రాజధానిగా ప్రకటించినప్పుడు కనీస మద్దతు తెలపకుండా గతంలో మౌనం వహించిన గంటా శ్రీనివాసరావు ఇప్పుడు అమరావతిని రాజధానిగా ప్రకటించగానే హర్షం వ్యక్తం చేయడం ఆయన రాజకీయ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందన్నారు. ప్రజాధనాన్ని కాపాడాలని, రాష్ట్రాన్ని సమానంగా అభివృద్ధి చేయాలని భావించిన దూరదృష్టి గల నాయకుడు జగన్ అని అన్నారు. అలాంటి నాయకుడిపై విమర్శలు చేయడం అంటే...ప్రజల అభివృద్ధి ఆశయాలపై దాడి చేయడమేనని.. ఆయన వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, విశాఖ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ నర్సుల సంఘానికి ఝలక్...!

### - రూ. లక్షల్లో వసూళ్లు చేశారన్న ఫిర్యాదు

### - ఆ 30 మంది హెడ్ నర్సులకు కూడా తాఖీదులు

### - ఓర్వలేక అసత్య ఫిర్యాదులన్న అధ్యక్షకార్యదర్శులు

**విశాఖపట్నం, ఏప్రిల్ 3, జయ జయహే :**

విశాఖ జిల్లా ప్రభుత్వ నర్సుల సంఘం ప్రతినిధులకు వైద్య ఆరోగ్య శాఖ ఝులక్ ఇచ్చింది. ఇటీవల హెడ్ నర్సుల పదోన్నతుల విషయంలో భారీ ఎత్తున వసూళ్లకు పాల్పడినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 13న విచారణకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. విశాఖ డీఎం అండ్ హెచఓ కార్యాలయం పక్కనే ఉన్న మేల్ ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో విచారణకు సంబంధిత అన్ని డాక్యుమెంట్ ఆధారాలతో హాజరు కావాల్సిందిగా ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వ నర్సుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు గంగా భవానీ, వరలక్ష్మి లతో పాటు కార్య నిర్వాహక సభ్యురాలు ఎస్. గంగా గౌరికి కూడా నోటీసు ఇచ్చారు. అలాగే పదోన్నతులు పొందిన 30 మంది హెడ్ నర్సులను కూడా విచారణకు పిలిచారు. సిటిజెన్స్ ఫోరం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బీవీకే బాబాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నోటీసులు జారీ చేసినట్టు అధికారులు వెల్లడించారు. అయితే విచారణకు హాజరవుతామని ప్రభుత్వ నర్సుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు గంగా భవానీ, వరలక్ష్మిలు తెలిపారు. ఇలాంటి ఆకాశరామన్న ఉత్తరాలతో ఆయన చాలా ఫిర్యాదులు చేశారని, అయితే విచారణకు మాత్రం ఫిర్యాదు చేసిన వ్యక్తి రాకపోవడం ఆనవాయితీగా వస్తోందని అందుకు తమ వద్ద ఆధారాలున్నాయని వెల్లడించారు. తమ సంఘం పై ఈర్ష్యతోనే బురద జల్లే యత్నం చేస్తున్నారని అందులో భాగంగానే అసత్య ప్రచారానికి ఇదొక మచ్చుతునకగా అభివర్ణించారు.





పచ్చి కొబ్బరిని వాడితే..
బ్యూటీ పార్లర్‌కు వెళ్లాల్సిన

# అవసరమే ఉండదు

కొబ్బరితో ఎన్నో రకాల రుచికరమైన వంటలను తయారుచేసుకోవచ్చు. ఎక్కువగా ఇది దక్షిణ భారతదేశంలో వాడుతుంటారు. ప్రతీ వంటకాల్లోను కొబ్బరిని ఉపయోగిస్తుంటారు. అందువల్ల అక్కడ ప్రతీ ఒక్కరు అందంగాను, యవ్వనంగాను కనిపిస్తుంటారు. అయితే కొబ్బరిని సాధారణంగా అయితే కొబ్బరి చట్నీ, సాంబార్, కొబ్బరి అన్నం, కొబ్బరి స్వీట్ వంటి రకరకాల పదార్థాలను తయారుచేసుకుని ఆస్వాదిస్తుంటారు అని మాత్రమే తెలుసు. అంతేకాదు కొబ్బరిని పొడిగా చేసుకుని ప్రతీ వంటల్లోను ఉపయోగిస్తే ఎంతో రుచికరమైన ఆహారాన్ని తినవచ్చు.

అయితే పచ్చి కొబ్బరితో ఆరోగ్యానికి పుష్కలమైన ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యంతో పాటు చర్మ సౌందర్యాన్ని కూడా కాపాడుకోవచ్చని కూడా అంటున్నారు. కొబ్బరిలో ఫైబర్, విటమిన్ సి, ఈ, బి, ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, మినరల్స్ వంటివి పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మాత్రమే కాదు చర్మ సౌందర్యాన్ని కూడా రక్షిస్తాయి.

పచ్చి కొబ్బరి జీవక్రియను కూడా మెరుగుపరుస్తుంది. ఇది మలబద్ధకం వంటి సమస్యలను కూడా దూరం చేస్తుంది. కొబ్బరిలో ఉండే విటమిన్లు, మినరల్స్ జుట్టును ఆరోగ్యంగా ఉంచడంతో పాటు చర్మాన్ని కూడా యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. ముఖ్యంగా వయసు మీద పడుతున్న వారికి ఇది ఓ అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. చర్మంపై ముడతలు, మచ్చలు వంటి వాటిని తొలగించేందుకు తోడ్పడుతుంది. కొబ్బరిలో పుష్కలమైన విటమిన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు వంటి ఉండడం వల్ల ఇవి బరువును తగ్గించుకోవడానికి కూడా సహాయడపతాయి. అందువల్ల తరచూ కొబ్బరిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఆకలిని తగ్గించి బరువు నియంత్రిస్తుంది. అధిక కేలరీలు తీసుకోవడం వంటి వాటిని కూడా నిరోధిస్తుంది.

కొబ్బరి కేవలం చర్మ సౌందర్యానికి మాత్రమే కాకుండా అనారోగ్య సమస్యలకు కూడా ఎంతగానో సహాయపడుతుంది. అందులో ముఖ్యంగా ప్రస్తుతం ఎదుర్కుంటున్న గుండె సమస్యలకు అద్భుతంగా పనిచేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది. మంచి కొలస్ట్రాల్ పెంచి, చెడు కొలస్ట్రాల్ ను తగ్గిస్తుంది. పచ్చి కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉండడం వల్ల రోగనిరోధక వ్యవస్థలను బలపరుస్తుంది. అంతేకాదు ఇందులో ఉండే కాల్షియం, పొటాషియం ఎముకలను బలోపేతం చేసేందుకు సహాయపడతాయి.

# అంతర్జాతీయ స్థాయికి విశాఖే లక్ష్యం

## వార్డు సెక్రటేరియట్ సిబ్బంది పట్ల కఠినంగా ఉండాల్సిందే

- ప్రజాప్రతినిధుల సూచనలు..ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

- జీవీఎంసీ ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి సమీక్ష.

జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ప్రత్యేక అధికారి అభిషిక్త్ కిషోర్



**విశాఖపట్నం ఏప్రిల్ 3, జయ జయహే :**

విశాఖ నగరాన్ని ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలక్టరు ఎం. అభిషిక్త్ కిషోర్ అన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర జీవీఎంసీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కలక్టర్ మాట్లాడుతూ విశాఖ నగరం పై అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరుగుతుందని అందరి దృష్టి విశాఖపై కేంద్రీకృతమవుతుందని అందుకు మునిసిపల్ యంత్రాంగం తగిన విధంగా ప్రణాళికలు రూపొందించి పనిచేయాలని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అమలవుతున్న అత్యుత్తమ ప్రాజెక్ట్ ను స్ఫూర్తి గా తీసుకొని విశాఖలో నూతన పనులు ప్రారంభించాలని సూచించారు. అధికారులు నిరంతరం క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలు తెలుసుకొని ప్రజాప్రతినిదుల సూచనల మేరకు, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ పనులు చేపట్టాలన్నారు. జీవీఎంసీ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేలా సిబ్బంది పనితీరు ఉండాలని పేర్కొన్నారు. వార్డు సేక్రేటేరియట్ సిబ్బంది పై వస్తున్న ఆరోపణలను దృష్టిలో ఉంచుకుని వారిపై కఠినంగా వ్యవహరించాలని అన్నారు. అంతర్జాతీయ స్థాయికి నగర అభివృద్ధి దిశగా జీవీఎంసీ ఆదాయ పరిపుష్టికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. భోగాపురం ప్రారంభం నాటికి రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, ఎక్కడైనా భూ సమస్య ఉంటే జాయింట్ కలక్టర్ తో చర్చించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, ఎస్. ఎస్ .వర్మ, పి.నలనయ్య, జాయింట్ డైరెక్టర్ అమృత్ విజయభారతి, ప్రధాన ఇంజనీరు సత్యనారాయణ రాజు, ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఏ .ప్రభాకర్ రావు, డిసిఆర్ శ్రీనివాసరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, ఇంచార్జ్ డిడిహెచ్ వాసుకి, వ్యయ పరిశీలకులు సి. వాసు దేవ రెడ్డి, ఇంచార్జ్ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ ఎ రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, ప్రణాళిక అధికారులు, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# నేటి నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు

## రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాలు

## వెల్లడించిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల

**కాకినాడ, ఏప్రిల్ 3, జయ జయహే :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది.. నేటి నుంచి రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలియజేశారు.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.ఇక, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ధాన్యం నిల్వ మరియు రవాణా విషయంలో కూడా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసింది. మొత్తం 5.40 కోట్ల గోతాలను సిద్ధం చేసినట్లు, గోతాల కొరత రాకుండా మిల్లర్లతో ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిపారు. అలాగే ధాన్యం రవాణా కోసం 17,200 లారీలను జీపీఎస్ సదుపాయంతో సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మొత్తంగా, ఈసారి రబీ ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా జరిగేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

# చికెన్ వింగ్స్.. ఇంట్లోనే సులువుగా చేసుకోవచ్చు



**చికెన్ వింగ్స్ పేరు చెబితేనే నోరూరిపోతుంది. దాన్ని తినాలంటే ప్రతిసారి రెస్టారెంట్ కి వెళ్లాల్సిన అవసరం లేదు. ఇంట్లోనే చాలా సులువుగా చేసుకోవచ్చు. కాస్త ఓపిక ఉంటే చాలు చికెన్ వింగ్స్ గంటలో రెడీ అయిపోతాయి. ఇవి ఇంట్లో ఉన్న పిల్లలకు, పెద్దలకు కూడా ఇది బాగా నచ్చుతాయి. ఎలా చేయాలో తెలుసుకోండి.**

**చికెన్ వింగ్స్ రెసిపీకే కావలసిన పదార్థాలు**

చికెన్ వింగ్స్ - అరకిలో
మైదాపిండి - అరకప్పు
కారం - ఒక స్పూను
మిరియాల పొడి - అర స్పూను
ఉల్లిపాయ పొడి - ఒక స్పూను
వెల్లుల్లి పొడి - ఒక స్పూను
నూనె - వేయించడానికి సరిపడా
ఉప్పు - రుచికి సరిపడా
బటర్ - రెండు స్పూన్లు
సోయాసాస్ - ఒక స్పూన్
బ్రౌన్ షుగర్ - మూడు స్పూన్లు
వెల్లుల్లి తురుము - ఒక స్పూను
అల్లం తురుము - ఒక స్పూను
తేనె - ఒక స్పూన్
పచ్చిమిర్చి - రెండు
ఎండుమిర్చి - రెండు
నువ్వులు - ఒక స్పూను
సోయాసాస్ - రెండు స్పూన్లు

**చికెన్ వింగ్స్ రెసిపీ**

చికెన్ వింగ్స్ ను తెచ్చి శుభ్రంగా కడిగి తడి లేకుండా టిష్యూ పేపర్ మీద ఆరబెట్టాలి.

ఒక గిన్నెలో మైదా, కారం, ఉప్పు, పచ్చిమిర్చి తరుగు, వెల్లుల్లి తరుగు, ఉల్లిపాయల పొడి వేసి బాగా కలిపి చికెన్ వింగ్స్ ను కూడా వేయాలి.

ఆ మిశ్రమం చికెన్ వింగ్స్‌కు బాగా పట్టేలా ఒక అరగంట పాటు పక్కన పెట్టేయాలి.

ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి.

చికెన్ వింగ్స్ అందులో వేసి వేయించి తీసి టిష్యూ పేపర్ మీద వేసుకోవాలి.

ఇప్పుడు ఒక కళాయిని స్టవ్ మీద పెట్టి చిన్న మంట పెట్టాలి. 7. దానిలో బటర్ వేయాలి. ఆ బటర్ లో అల్లం వెల్లుల్లి తురుమును వేయాలి.

అలాగే సోయాసాస్, తేనే, బ్రౌన్ షుగర్ కూడా వేసి కలుపుకోవాలి.

సాస్ కొద్దిగా చిక్కగా అయ్యాక పెద్ద మంట పెట్టి ముందుగా వేయించి తీసుకున్న చికెన్ వింగ్స్ ను వేసి టాస్ చేసుకోవాలి.

చివర్లో ఎండుమిర్చి ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి కలుపుకోవాలి.

నువ్వులు గింజలను చల్లుకోవాలి. అంతే టేస్టీ చికెన్ వింగ్స్ రెడీ అయినట్టే. ఇది నోరూరించేలా ఉంటాయి.

ఇంట్లో పిల్లలకు పెద్దలకు అందరికీ నచ్చుతాయి

చికెన్ వింగ్స్ బయట ఎక్కువ రేటు ఉండే అవకాశం ఉంది. అదే ఇంట్లో చేసుకుంటే చాలా తక్కువ ధరకే ఇవి రెడీ అయిపోతాయి. ముందుగానే చికెన్ షాప్ వాడికి వింగ్స్ ను వేరుగా చేసి పెట్టమని ఆర్డర్ ఇచ్చుకోవాలి. లేదా ఆన్లైన్ చికెన్ మార్కెట్లలో కూడా చికెన్ వింగ్స్ సపరేట్ గా దొరుకుతున్నాయి. వాటిని కొనుక్కున్నా సరిపోతుంది. టేస్టీ చికెన్ వింగ్స్ వండేసుకోవచ్చు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com